



నగరంలోని ఫత్తేఖాన్‌పేటలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన కాలువ

మురుగు కదలదేం..
చెత్త తీయరేం!

- కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో అలసత్వం
- మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్ ఆగ్రహం, అసహనం
- ఇకనైనా సిబ్బంది గాడిలో పడేనా!?

'రోడ్లపై చెత్త ఎందుకు ఉంటోంది. కాలువల్లో పూడిక తీయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పని చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి.'

- నెల్లూరు నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగం పనితరుపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ ఇటీవల చేసిన వ్యాఖ్యలివి. నగరానికి చెందిన ముగ్గురు ప్రముఖులే ఇంతటి అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారంటే క్షేత్రస్థాయిలోనూ పరిస్థితులు అదేవిధంగా ఉన్నాయి. ఇంటింటా చెత్తసేకరణ మొక్కుబడి తంతుగా మారిపోయింది. ఫలితంగా ఇళ్లలోని చెత్తా రోడ్లపైకి చేరిపోతోంది. అలాగే కాలువల్లో వ్యర్థాలు, పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలనంటోంది. పట్టపగలే దోమలు విజృంభిస్తుండటంతో నగరవాసులకు కంటిమీద కునుకు లేకుండాపోతోంది. ఆ ముగ్గురు ప్రముఖుల వ్యాఖ్యలతోనైనా పారిశుధ్యం విభాగం గాడిలో పడుతుందా!? అన్నది వేచి చూడాల్సిందే.

టెక్కేమిట్టలో చెత్తతో నిండిపోయిన కాలువ

7

ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

- నేడు, రేపు అధికారులంతా పంచాయతీల్లోనే

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు డీపీవో శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో అధికారులంతా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ఉదయం 6 గంటలకే అధికారులంతా పంచాయతీల్లో విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. రెండురోజుల్లో వంద శాతం చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్త కుప్పలు, రోడ్ మార్జిన్, రోడ్ పక్కన పశువుల పేడదిబ్బలు తొలగించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. సేకరించిన చెత్త సేకరణ వివరాలను పీఆర్ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు.

142 సచివాలయాలకు షోకాజు నోటీసులు



నెల్లూరు (సిటీ) : మధ్య, చిన్నతరహా పరిశ్రమల గుర్తింపుపై జరుగుతున్న సర్వేలో ఆశించిన ఫలితాలు ఎందుకు రాబట్టలేకపోయారో వివరణ ఇవ్వాలని కోరుతూ ఏడీసీ నందన్ నెల్లూరులోని 142 సచివాలయాలకు శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఎంఎస్ఎంఈ సర్వేను ప్రభుత్వ ఆదేశాలనుసారం ఎందుకు నిర్వహించలేకపోతున్నారో నోటీసులు అందిన 24 గంటల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఏడీసీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 142 సచివాలయాల్లోని కార్యదర్శులందరికీ షోకాజు నోటీసుల సారాంశం వర్తిస్తుందని పేర్కొన్నారు. కాగ వరుస సర్వేలతో తాము నికర విధులను నిర్వర్తించలేకున్నామని, దీనిపై కలెక్టర్‌తో సమావేశమై అనంతరం ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సచివాలయ కార్యదర్శులు పేర్కొన్నారు.

రేపు నగరానికి సీఎం రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నెల్లూరు నగరానికి రానున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడి వివాహంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కనుపర్తిపాడు ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, రూట్, వీఆర్ కన్వెన్షన్ సెంటర్, పార్కింగ్ ప్రాంతాలను కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, బీద రవిచంద్ర ఇతర అధికారులు పరిశీలించారు. ప్రత్యేక బలగాలతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రూఫ్‌టాప్‌పై ప్రత్యేక దృష్టి సారించి భద్రత పెంచాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, పక్కన ఎస్పీ కృష్ణకాంత్, టీడీపీ నేత బీద రవిచంద్ర తదితరులు

రెవెన్యూ సమస్యలపై
శ్రద్ధ పెట్టి పరిష్కరించండి

- పాసుపుస్తకాలు సకాలంలో అందించండి
- అధికారుల సమీక్షలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిసోడియా



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న సిసోడియా

నెల్లూరు (హరనాధపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాంప్రసాద్ సిసోడియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, భూ ఆక్రమణలు, భూ సంబంధిత కోర్టు కేసులు తదితర అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో (గ్రీవెన్స్) వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలని సూచించారు. సమస్యలతో వచ్చే అర్జీదారుల పట్ల గౌరవ, మర్యాదలతో వ్యవహరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే చేసిన భూముల కొలతలతో చిన్న చిన్న తేడాలు ఉంటే రైతులను పిలిపించి నచ్చజెప్పి వీలైనంత వరకు పరిష్కరించాలని అన్నారు. భూములలో ఆక్రమణలు తొలగించి మరల ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా పట్టాదారు పాసు పుస్తకాలు సకాలంలో అందించాలని, చుక్కల భూముల విషయంలో ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని సూచించారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలన్నారు. కోర్టు కేసులను తేలికగా తీసుకోకుండా వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కౌంటర్ అఫిడవిట్‌లు ఫైల్ చేయాలన్నారు. తీర ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ అఫిడవిట్లు ఫైల్ చేయడంలో జాప్యం లేకుండా ఆర్డీవో, తహసీల్దార్లకు ఆదేశాలు ఇస్తామని అన్నారు. లీగల్ సెల్ ఏర్పాటు చేసి కేసుల సత్వర పరిష్కారం చర్యలు తీసుకుంటామని జేసీ వివరించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ఆర్డీవోలు జె.ఉదయ భాస్కర్‌రావు వంశీకృష్ణ, పావని తదితరులు పాల్గొన్నారు.

రన్‌వేకు భూములు ఇస్తే
పనులు ప్రారంభిస్తాం

- ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రతినిధులు
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం
- 2027 కల్లా విమానాశ్రయం ప్రారంభం కావాలి
- ప్రతినిధులతో కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యే
- దామవరం వద్ద భూముల పరిశీలన

దగదర్తి (కావలి), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దగదర్తి మండలం దామవరం వద్ద నిర్మించనున్న విమానాశ్రయంలో భాగమైన రన్‌వేకు అవసరమైన భూములు ఇస్తే టెండర్లు పిలిచి పనులు ప్రాంబించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ మల్లికా జయరాజి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులు, కలెక్టర్ ఆనంద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి తదితరులు విమానాశ్రయ భూములను పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్, రన్‌వేకు అవసరమైన భూములను వాటి స్థితిగతులను క్షేత్రస్థాయితోపాటు వాటి మ్యాప్‌లను పరిశీలించారు. ఇప్పటికే 700 ఎకరాలు సేకరించి అప్పజెప్పామని, దానిలో రన్‌వే నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఎంపీలు, ఎమ్మెల్యే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులకు తెలిపారు. రన్‌వేకు ఎలాంటి భూములు కావాలో చెబితే రైతులకు నచ్చజెప్పి ముందుగా అప్పగించేందుకు సిద్ధమన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం కావాలన్నా వెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, డీపీఆర్ సిద్ధం చేసి టెండర్లు పిలిచి 2027 నాటికి విమానశ్రయం ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ఇక విమానాశ్రయ పనులు ప్రారంభిస్తే ఆగే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. జిల్లాకు బీపీసీఎల్, ఇండోసెల్ కంపెనీలు రావడం అదృష్టమని అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ రన్‌వేకు డీపీఆర్ సిద్ధం చేసి టెండర్లు పిలిచేందుకు సిద్ధపడితే రైతులను ఒప్పించి భూములను ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. భూసేకరణకు అవసరమైన రూ.96 కోట్ల నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రన్‌వేకు అవసరమైన భూములను సేకరించి అప్పగించామని, పనులు ప్రారంభించుకోవచ్చని తెలిపారు. అలాగే భూసేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు.



విమానాశ్రయ పైలాన్ వద్ద ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రతినిధులు, కలెక్టర్ ఆనంద్, ఎంపీలు వేమిరెడ్డి, బీద, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

ఏపీపీఎస్సీ పరీక్షలకు కంట్రోలు రూమ్

నెల్లూరు (హరనాధపురం) : ఆదివారం జరిగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 మెయిన్ పరీక్షల నిర్వహణకు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం శని, ఆదివారాలు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాల చిరునామా, ఇతర సమాచారం కోసం 0861 2332261 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

చేవూరులోలా మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు

కలెక్టర్, ఎమ్మెల్యేకు తేల్చి చెప్పిన రావూరు రైతులు

16 కాదు.. 50 లక్షలు ఇప్పించండి!



కలెక్టర్, ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రైతులు

గుడ్లూరు, ఫిబ్రవరి 21 : ఒక ఎకరాకు ప్రభుత్వ నిర్ణయంచిన రూ.16 లక్షలతో రైతులు నష్టపోతారు. దీనిని రూ.50లక్షలకు పెంచి పరిహారం ఇవ్వండి.' అంటూ రావూరు రైతులు స్పష్టం చేశారు. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు రావూరు పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల భూసేకరణకు సంబంధించి శుక్రవారం కలెక్టర్ ఆనంద్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం రైతులతో అభిప్రాయాలు సేకరించారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ రావూరులో - మిగతా 6లో

ఇక ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 300 కేంద్రాలు
- తొలి కేంద్రం సంగంలో ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంగంలోని పీఏసీఎస్‌లో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తర్వాత రైతులతో సమావేశమవుతారు. ధాన్యం రాశులను పరిశీలిస్తారు.

300 కేంద్రాలు..

జిల్లాలో 1,44,761 హెక్టార్లలో వరి పంట వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్క. దీని ద్వారా 11.01 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఈ ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న 523 రైతు సేవా కేంద్రాలకు అనుసంధానంగా 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్ణయిం చారు. కొనుగోలు కేంద్రాల సిబ్బందికి, వీవోఏలకు శిక్షణ కార్యక్రమాలను కూడా పూర్తి చేశారు. ముందుగా పంట చేతికొచ్చే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు తెరుస్తారు.

కనీస మద్దతు ధర ఇలా..

ధాన్యం సేకరణకు సంబంధించి కనీస మద్దతు ధరను ప్రభు త్వం ప్రకటించింది. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి పుట్టికి రూ.19720, సాధారణ రకానికి పుట్టికి రూ.19550 ధర చెల్లిస్తారు. భారత ప్రభుత్వ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. 17 శాతానికి మించకుండా తేమ లేదా నెమ్ము ఉండాలి. ఈ-పంట పోర్టల్‌లో నమోదు చేసి, ఈకేవైసీ పూర్తి చేసిన రైతుల్లో ధాన్యాన్ని విక్రయించడానికి సిద్ధమైన వారి నుంచి మాత్రమే కొనుగోలు చేస్తారు. ధాన్యం అమ్మిన ప్రతి రైతు తమ బయోమెట్రిక్‌ను రైతు సేవా కేంద్రంలో తప్పనిసరిగా ఇవ్వాలి. గోనె సంచులు, హమాలీలు, రవాణా వసతిని రైతులే ఏర్పాటు చేసుకుంటే ప్రభు త్వ లెక్కల ప్రకారం అందుకయ్యే మొత్తాన్ని రైతు ఖాతాల్లో ధాన్యం సొమ్ముతో కలిపి జమ చేస్తారు.

ఎంత ధాన్యమైనా కొంటాం

జిల్లాలో పండిన ధాన్యాన్ని సేకరించడానికి అన్నీ ఏర్పాట్లు చేశాం. ఒక లక్ష్యం అంటూ లేదు. ఎంత ధాన్యం వచ్చినా తీసుకుం టాం. రైతులకు మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాం.

- డీ అర్జున్‌రావు,
జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్



మంత్రి మనోహర్‌కు స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

నెల్లూరుకు చేరుకున్న మంత్రి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. విజయవాడ నుంచి వందేభారత్ రైలులో నెల్లూరుకు వచ్చిన ఆయనకు జనసేన, తెలుగుదేశం, బీజేపీ నేతలు, జిల్లా అధికారులు, పోలీసులు ఘన స్వాగతం పలికారు. ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి బోసుబొమ్మ, గాంధీబొమ్మ, వీఆర్సీ, రామలింగాపురం నుంచి మినీబైపాస్ మీదుగా జనసేన పార్టీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. మంత్రితోపాటు టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఇతర నాయకులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి


కార్ అండ్ బైక్ రేస్



ఫిబ్రవరి నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది ఫిబ్రవరి నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా


ఆంధ్రజ్యోతి బిల్డింగ్, నెం.91, ఉడ్ కాంప్లెక్స్,
అయ్యప్పగుడి సెంటర్, వేదాయపాళెం, నెల్లూరు-524004.
సెల్: 99854 11421, 99854 11424

జయ గోవింద.. గోవింద హరే..!

కనుల పండువగా శ్రీనివాస కల్యాణోత్సవాలు

నెల్లూరులోని నిప్పో ఫ్యాక్టరీ ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, నివేదన, శాత్తుముర్రై జరిగాయి. అనంతరం మహా స్నపన తిరుమంజనం, పూర్ణాభిషేకం, వస్త్రాలంకరణ సేవ భక్తులకు కనువిందు చేశాయి. సాయంత్రం జరిగిన సహస్ర దీపాలంకరణ సేవకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. డాక్టర్ గంగాధర శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం ఆకట్టుకుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస నృత్య రూపకం అలరించింది. 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా అహళ్య, సాయిసునీల్ తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం శ్రీనివాస కల్యాణం, పుష్పయాగం జరగనున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)









సహస్ర దీపాలంకరణ, శ్రీవారిని తిలకిస్తున్న భక్తులు

16 కాదు.. 50 లక్షలు ఇప్పించండి!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటయ్యే అతిపెద్ద రిఫైనరీ కోసం భూములను సేకరించనున్నట్లు తెలిపారు. ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా, అందరికీ మేలు జరిగే పద్ధతిలో భూముల సేకరణ ఉంటుందన్నారు. ఒక ఎకరాకు సుమారు రూ.16 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ పచ్చని పంట పొలాలను ఈ ఇండస్ట్రియల్ హబ్ కోసం ఇచ్చేందుకు ఎవరికీ ఇష్టం లేదన్నారు. పక్కగ్రామమైన చేవూరులో భూముల సేకరణ విషయంలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి పద్ధతి రావూరులో కూడా ఉంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అయితే, ఎకరాకు రూ.16 లక్షలు ఇవ్వడం ద్వారా నష్టపోతామని, దీనిని రూ.50లక్షలకు పెంచాలని కోరారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ భూముల ధర విషయం సీఎం దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రజాభిప్రాయాలతో నివేదిక తయారుచేసి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ రాజశేఖర్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, తహసీల్దారు స్వర్ణ, ఎమ్పీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచ్ సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఇంటర్‌లో వండరే!

- అధ్యయనంతోనే ఉత్తమ ఫలితాలు
- సబ్జెక్ట్ నిపుణుల దిశానిర్దేశం

ఇంటర్.. కెరీర్ క్రాస్‌రోడ్స్‌లో కీలకమైన దశ. ఇంటర్‌లో సాధించిన మార్కులు భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగసాధనలో కీలకంగా మారతాయి. ఇంటర్‌లో ప్రతిభ చూపితేనే విద్యార్థి జీవితంలో సరికొత్త మార్పు వస్తుంది. ఉన్నత చదువులకు బీజం పడుతుంది. అందుకే విద్యార్థులు ఇంటర్‌లో టాప్ స్కోర్ సొంతం చేసుకునేందుకు పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. ఇప్పటికే ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. పరీక్షలు సమీపిస్తుండటంతో సమయం వృథా చేయకుండా విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉన్న తక్కువ సమయంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షల్లో టాప్ మార్కులు ఎలా సాధించాలన్న దానిపై సబ్జెక్ట్ నిపుణుల సూచనలివి.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



ఆంగ్లం.. ఎంతో సులభం



ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ను ఒక క్రమపద్ధతిలో చదివితే వంద శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు. మూడు సెక్షన్ లలో ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రథమ సంవత్సరం సెక్షన్ ఏలో ప్రోస్, పొయిట్రీ, అనొటేషన్‌కు 16 మార్కులకు, పేరాగ్రాఫ్ ప్రశ్నలు 16 మార్కులకు, ఎక్స్‌టెన్సివ్ రీడింగ్‌కు 8 మార్కులు కలిపి 40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్-బీలోని టెక్నువల్‌లో సాధన చేసి 10 మార్కులకు జవాబులు రాయాలి. ప్రధానమైన సీ సెక్షన్‌లో ఉన్న 50 మార్కుల ప్రశ్నలే కీలకం. వీటిని విద్యార్థికి ప్రారంభం నుంచి పరీక్షలు వచ్చే వరకు ఏ ప్రశ్నలు ఎలా చదవాలో తెలియ చేయడంతోపాటు క్రమపద్ధతిలో వారిని సంసిద్ధులను చేస్తాము. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో కూడా మూడు సెక్షన్‌లుగా ప్రశ్నపత్రలు ఉంటాయి. వీటిలో కూడా వందశాతం మార్కులు ఎలా సాధించాలన్న దానిపై విద్యార్థులను సన్నద్ధం చేస్తాము. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా పాఠ్యపుస్తకాలను చదవడంతోపాటు పాత ప్రశ్నపత్రాలను ఖచ్చితంగా పరిశీలించుకుంటే సులభంగా అనుకున్న లక్ష్యాన్ని చేధించవచ్చు.

- ఎ.శ్రీహర్ష వర్ధన్, ఇంగ్లీష్ సీనియర్ అధ్యాపకుడు

గణితం అంటే భయం వద్దు



గణితం అంటే తొలుత భయం వీడాలి. గణితంపై శ్రద్ధ పెడితే ఎక్కువ మార్కులు సులభంగా పొందవచ్చు. ప్రతిరోజూ నిద్రలేవగానే 15 నిమిషాల పాటు ఫార్ములాలు చదవడంతోపాటు గుర్తుపెట్టుకోవాలి. దినచర్యలో ఇది ఒక భాగం కావాలి. వందశాతం మార్కులు పొందాలంటే ప్రతి చాప్టర్‌లో ప్రశ్నలను ఖచ్చితంగా రెండుసార్లు సాధన చేయాలి. పరీక్షల సమయంలో తొలుత మొదటి సెక్షన్‌లోని 7 మార్కుల ప్రశ్నలకు, అనంతరం 4 మార్కులకు, చివరన 2 మార్కుల ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రతి ప్రశ్నలో చివరగా ముగింపును చక్కగారాసి పెన్సిల్‌తో అండర్ లైన్ చేస్తే మంచి మార్కులు పొందవచ్చు. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయన్న అవగాహన ఏర్పడుతుంది. వీటి ప్రకారం ఆయా చాప్టర్‌లపై ఎక్కువ సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయి. పేపర్-ఏలో మాట్రిక్స్, మేథమేటికల్ ఇండక్షన్, థియరీస్ ఇన్ ఫంక్షన్స్, ట్రాన్స్‌ఫర్మేషన్, ట్రిగ్నామీటర్స్, ఆల్‌జీబ్రాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అలాగే పేపర్-బిలో స్ట్రెయిల్ లైన్స్, పెయిర్ లైన్స్, డైరెక్షన్ అండ్ రేషియోస్, లిమిట్స్ కంట్యూనిటీ, ట్రిగ్నామీటర్ తదితర చాప్టర్స్‌పై దృష్టి పెడితే మంచి మార్కులు పొందవచ్చు.

- బి.పెంచలరావు, సీనియర్ అధ్యాపకులు, గణితశాస్త్ర నిపుణులు

భౌతికశాస్త్రంలో అవగాహనతోనే మార్కులు



ఇంటర్‌లో భౌతికశాస్త్రం ఎంతో కీలకమైనది. నిపుణుల సహకారంతో సరైన మార్గంలో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం సిలబస్‌ను మూడు భాగాలుగా విభజించి ఒక్కో భాగం నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఈ ప్రశ్నకు లింక్ ప్రాబ్లం కూడా ఇచ్చే అవకాశం ఉన్నందున టెక్స్ట్ బుక్ చివరన ఉన్న ప్రాబ్లమ్స్ నేర్చుకోవాలి. పరీక్ష రాసే సమయంలో ప్రశ్నపత్రాన్ని కనీసం 5 నిమిషాలు చదవాలి. ప్రశ్నపత్రంలోని మూడు విభాగాల్లో వీఎస్ఏకు 35 నిమిషాలు, ఎస్ఏకు 80 నిమిషాలు, ఎల్ఏకు 45 నిమిషాల చొప్పున సమయం కేటాయించుకోవాలి. అలాగే ప్రశ్నలను ఎన్నుకునే సమయంలో తొలుత ప్రాబ్లం ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. థియరీ ఉన్న ప్రశ్నలను చివరగా ఎంపిక చేసుకుని సమాధానాలు రాస్తే మంచి మార్కులు వస్తాయి. ముఖ్యంగా డయాగ్రమ్‌ను పెన్సిల్‌తో వేసి అందులో భాగాలను గుర్తించాలి. 60కి 60 మార్కులు పొందడానికి 2 మార్కుల ప్రశ్నలే కీలకం. కనీస మార్కులు పొందడానికి 8 మార్కుల ప్రశ్నలే ముఖ్యం. పాఠ్యపుస్తం చివరన ఉన్న 2 మార్కుల ప్రశ్నలను చదవడం ద్వారా మంచి మార్కులు పొందవచ్చు.

- జె.శివశంకర్, భౌతికశాస్త్ర నిపుణులు



విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న అధ్యాపకులు

ప్రణాళికతో వృక్షశాస్త్రంలో విజయం



విద్యార్థులు ప్రణాళికతో చదివితే వృక్షశాస్త్రంలో విజయాలు సాధించవచ్చు. సబ్జెక్ట్‌లోని అన్ని చాప్టర్స్‌ను విభాగాలుగా విభజించి ప్రతిభాగానికి నిర్దిష్టంగా వ్యవధిని కేటాయించుకోవాలి. ప్రశ్నపత్రంలో మూడు భాగాలు ఉంటాయి. సెక్షన్-ఏలో 2 మార్కుల చొప్పున పది ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్-బీలో ఇచ్చే 8 ప్రశ్నల్లో ఆరు ప్రశ్నలకు జవాబులు రాయాలి. ఒక్కో జవాబుకు 4 మార్కులు చొప్పున కేటాయిస్తారు. సెక్షన్-సీలో ఉండే మూడు ప్రశ్నల్లో రెండు ప్రశ్నలకు జవాబులు రాయాలి. ఒక్కో ప్రశ్నకు 8 మార్కులు కేటాయిస్తారు. ఈ సబ్జెక్ట్‌లో ప్రత్యేకంగా డయాగ్రమ్‌ను నీట్‌గా ప్రజెంట్ చేయాలి. సమయ పాలన పాటిస్తూ ఇచ్చిన సమయాన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులు సన్నద్ధం కావాలి. 60కు 60 మార్కులు తెచ్చుకోవాలంటే 2 మార్కుల ప్రశ్నలే కీలకం. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దు. అధ్యాపకుల సూచనలు పాటిస్తూ వారిచ్చిన ప్రశ్నలను చదివితే పూర్తిమార్కులు పొందవచ్చు.

- బి.కొండయ్య, వృక్షశాస్త్రం సబ్జెక్ట్ నిపుణులు

జంతుశాస్త్రంలో సాధన అవసరం



జంతుశాస్త్రంలో ఖచ్చితమైన సాధన చేస్తే ఉత్తమ మార్కులు సాధించవచ్చు. తొలుత 8 మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. 60 మార్కులు రావాలంటే తప్పనిసరిగా 2 మార్కుల ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. ప్రధానంగా దంతం నిలువుకోత, శ్వాస వ్యవస్థ రుగ్మతలు, గుండె నిర్మాణం, గుండె పనిచేసే విధానం, ఎర్రని-తెల్లని కండరాలు, కీలు నిర్మాణం, కార్పస్ కెల్లోజం, సహానుభూత నాడీ వ్యవస్థ, వెన్నుపాము అడ్డుకోత, ఆడిసన్స్ వ్యాధి, కుషింగ్స్ సిండ్రోమ్, పిట్యూటరీ గ్రంధి స్రావకాలు, మానవ పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలు చాలా ముఖ్యమైన అంశాలుగా చదవాలి. అలాగే బహుళ యుగ్మ వికల్పాలు, లింగ నిర్ధారణ, జెనిక్ బ్యాలెన్స్ సిద్ధాంతం, జన్యుభారం, నాలుగు సజీవసేతువులు, నిర్మాణసామ్య, క్రియాసామ్య అవయవాలు, ఉత్పరివర్తన సిద్ధాంతం, డార్విన్‌నిజం, లేయర్స్ బ్రాయిలర్స్, వాక్సిన్ పదము, ఎంఆర్ఐ స్కానింగ్, కాన్సర్ కణాలు, ఈసీటీ లాంటికి ఎంతో ముఖ్యమైన అంశాలుగా పరిణగించి వాటిలో సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.

- ఎన్.చంద్రశేఖర్, సీనియర్ అధ్యాపకుడు

రసాయనశాస్త్రంలో మంచి మార్కులకు..



రసాయనశాస్త్రంలో మూడు ప్రత్యేక భాగాలుగా ప్రశ్నలుంటాయి. 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కులుగా ఉంటాయి. వీటిని క్రమ పద్ధతిలో చదువుకోవాలి. పరమాను నిర్మాణం, ఆవర్తన పట్టిక, రసాయన బంధం, పర్యావరణశాస్త్రం, స్టాయికోమెట్రి, వాయుస్థితి, కర్బన రసాయనశాస్త్రం కీలక అంశాలుగా గుర్తించి సాధన చేయాలి. గత ప్రశ్నపత్రాలను కూడా పరిశీలించాలి. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలి.

- ఎస్.బాలాజీ బాబు, సీనియర్ అధ్యాపకులు

సంస్కృతంలో వంద శాతం మార్కులు సాధించవచ్చు



ఇంటర్‌లో వందశాతం మార్కులు సంస్కృతం సబ్జెక్ట్‌తోనే సాధ్యమవుతాయి. జూనియర్, సీనియర్ ఇంటర్‌లో బోర్డు కేటాయించిన కొన్ని ప్రశ్నలకు తెలుగు, ఇంగ్లీష్‌లో జవాబులు రాసే వెసులుబాటు ఉంది. మిగిలిన అన్ని ప్రశ్నలకు సంస్కృతంలోనే జవాబులు రాయాలి. అలాగే వ్యాకరణాంశాలకు సంబంధించిన ప్రశ్నలన్నింటికీ ముందు సమాధానం రాసి చివర్లో వ్యాస రూప సమాధానాలు రాస్తే సమయం బాగా కలిసి వస్తుంది. వ్యాసరూప సమాధానాలు రాసే సమయంలో మధ్యలో సంస్కృత వ్యాఖ్యలు, సంధులు రాసేసమయంలో సంధిసూత్రాలు రాస్తే మంచి ఫలితాలు పొందవచ్చు.

- సముద్రాల రాధాకృష్ణ, అధ్యాపకుడు

ఏపీ స్టార్స్‌లో టెండర్లకు ఆహ్వానం

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టార్స్‌లో జైళ్ల శాఖ సిబ్బందికి శిక్షణ సందర్భంగా వారికి భోజన సదుపాయం కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామని ఏపీ స్టార్స్ ప్రధానాచార్యులు ఎస్ రాజారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు రూ.20,23,500 విలువైన భోజన కాంట్రాక్టుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 3వ తేదీ వరకు టెండరు ఫారాలు తీసుకోవచ్చన్నారు. ఫారం ధర రూ.100, జీఎస్టీ రూ.12 కలిపి మొత్తం రూ.112 చెల్లించి పొందవచ్చన్నారు. మార్చి 4వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు సీల్డ్ కవర్లు స్వీకరిస్తారని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు టెండరు కవర్లు తెరుస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మూలాపేటలోని ఏపీ స్టార్స్‌లో సంప్రదించాలని కోరారు.

ఉలవపాడు మామిడికి భౌగోళిక గుర్తింపునకు కృషి

- కేవీకే హెడ్ ప్రసాద్‌బాబు
- జిల్లాస్థాయి మామిడి రైతులతో సెమినార్

కందుకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మామిడికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (భౌగోళిక గుర్తింపు) ధ్రువీకరణ పత్రం పొందేందుకు కృషివిజ్ఞాన కేంద్రం కృషి చేస్తున్నట్లు కందుకూరు కేవీకే హెడ్ డాక్టరు జీ.ప్రసాద్‌బాబు తెలిపారు. స్థానిక కేవీకేలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మామిడి రైతులకు శిక్షణ, జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడారు. ఉలవపాడు మామిడికి పేరుప్రఖ్యాతలు, డిమాండ్ ఉన్నా భౌగోళిక గుర్తింపు లేక విదేశీ ఎగుమతులు లేక రైతులు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. ఉలవపాడు మామిడి రైతుసంఘం ద్వారా గుర్తింపు కోసం దరఖాస్తు చేయిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ఎగుమతులు వస్తే రైతుకు నికర ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో రాజాపేట ఉద్యాన పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ.శ్రీధర్, జిల్లా ఉదాన్య శాఖ అధికారి సుబ్బారెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీనివాసరెడ్డి, సంఘమిత్ర, ప్రాథమిక మిషన్ ప్రాజెక్టు మేనేజరు అరుణ్‌కుమార్‌రెడ్డి, కందుకూరు ఉద్యానాధికారి బి.జ్యోతి, జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉద్యాన అధికారులు, మామిడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, పక్కన శాస్త్రవేత్తలు

జడ్పీలో స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ పాల్గొన్నారు. గృహ నిర్మాణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా, జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో మెరుగుదల, సహకార, రిజిస్ట్రేషన్ శాఖ పై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వ్యవసాయ శాఖ, మైక్రో ఇరిగేషన్, విద్యా, వైద్యం, ఐసీడీఎస్ అధికారులతో సభ్యులు చర్చించి లోపాలను సవరించాలని సూచించారు. మరిన్ని శాఖలపైనా చర్చ సాగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉప చైర్మన్, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈవో విద్యారమ

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా గణపతి పూజ, మృత్సంగ్రహణం, సకల దేవతల ఆవాహనం, అంకురార్పణ జరిగాయి. ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఫెస్టివల్ అధికారి, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం 8గంటలకు ధ్వజారోహణం, రాత్రి 7గంటలకు సింహవాహన సేవ జరుగుతాయి.

ఒకటోసారి.. రెండోసారి..

- మాలకొండ షాపుల వేలం రెండోసారి కూడా వాయిదా!

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలో ఆలయ అధికారులు శుక్రవారం (రెండోసారి) నిర్వహించిన బహిరంగ వేలంలో కొన్ని వ్యాపారాల నిర్వహణ వేలం కూడా వాయిదా పడ్డాయి. మాలకొండ కల్యాణ మండపంలో పర్యవేక్షణాధికారి బైరాగిచౌదరి పర్యవేక్షణలో షాపులకు బహిరంగ వేలం చేపట్టారు. ఇందులో తలనీలాల వేలం మాత్రమే సీల్డ్ టెండర్ ద్వారా పూర్తయింది. మిగిలిన 11షాపుల్లో 3షాపులకు మాత్రమే వేలం పాడారు. మిగిలిన 8షాపుల నిర్వహణకు సరైన పాట రానందున ఆలయ అధికారులు ఈ నెల 28వ తేదీకి వేలంను వాయిదా వేశారు. కొండపైన బొమ్మల అంగడి-1 వేలంను మాలకొండకు చెందిన కామినేని శివయ్య రూ.5లక్షలు, బొమ్మల అంగడి-2 షాపును మాలకొండకు చెందిన కామినేని మాధవరావు రూ.4లక్షలు, కొండపైన ఫలహారశాల అంగడిని మాలకొండకు చెందిన వంకదారి కొండయ్య రూ.10.30 లక్షలకు పాడి వేలంలో షాపులను దక్కించుకున్నారు. మిగిలిన కొబ్బరి చిప్పలు, పాలు నెయ్యి, టోల్‌గేట్, అమ్మవారికి చీరలు, జాకెట్ సమర్పించు పాట, కొబ్బరికాయలు అమ్ముకునే అంగడి, ఫోటోలు, పూజాద్రవ్యములు, కూల్‌డ్రింక్స్ పాదరక్షలు వేలంకు పాటదారులు డిపాజిట్ చెల్లించకపోవడం, ఒకట్రెండు పాటలకు ఒకరిద్దరూ డిపాజిట్లు చెల్లించినా సరైన పాటలు రానందున ఆలయ అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు, పర్యవేక్షణాధికారి బైరాగిచౌదరి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణపై నిర్లక్ష్యం వీడాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు



వినతిపత్రం ఇస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు, నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్న వరికుంటపాడు తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసి యేషన్ సభ్యులు శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. వరికుంటపాడు మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న ఎర్రచందనం, జామాయిల్ చెట్లను కొందరు అక్రమార్కులు నరికి అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారమంతా తెలిసి కూడా రెవెన్యూ, పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ. మాలకొండయ్య అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగకపోతే ఈనెల 24న జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ. సురేష్‌బాబు, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతి రావు, అసోసియేషన్ ప్రతినిధులు బోయపాటి శ్రీను, దుర్గాప్రసాద్, మాధవరావు, శ్రీనివాసరావు, బీ. సుబ్బారావు, వెంకటేశ్వర్లు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్అర్.పాలెం పంచాయతీలోని కండేవారిబీడు సర్వే నంబరు 275లోని ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం. రమణయ్య తెలిపారు. శుక్రవారం ఆంధ్ర జ్యోతిలో అసైన్డ్ ల్యాండా... ఆక్రమిద్దాం శీర్షికతో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎస్.సీతా మహాలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్ఐ రమణయ్య, మొగిలిచెర్ల గ్రామ సచివాలయ వీఆర్ఓ వినోద్, సర్వేయరు వెంకటేష్‌లు ఈ భూములను పరిశీలించి సాగుచేసిన పొగాకు, మినుము పంటలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్ఐ రమణయ్య మాట్లాడారు. భూముల ఆక్రమణలు వాస్తవమే అన్నారు. ఆక్రమణదారులందరికీ నోటీసులిచ్చి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారి వెంట వీఆర్ఏ సీహెచ్.నరసింహం ఉన్నారు.

మొద్దు నిద్ర వీడేనా..

చెత్త తొలగేనా!?

- కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంపై విమర్శలు
- రోడ్లపై చెత్త, కాలువల్లో పూడిక
- ఇంటింటా చెత్త సేకరణలోనూ నిర్లక్ష్యం
- సిబ్బందిపై మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్ ఆగ్రహం, అసహనం
- ఇకనైనా సిబ్బంది గాడిలో పడేనా!?



అరవింద్ నగర్‌లోని రైల్వే ట్రాక్ వద్ద కాలువలో పేరుకున్న చెత్త

నెల్లూరు నగరంలో పారిశుధ్యం ఏమాత్రం బాగోలేదు. రోడ్లపై చెత్త ఎందుకు ఉంటోంది. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పనిచేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి. ఇక నుంచి పారిశుధ్య పనులు ఏడీసీకు అప్పగించండి. త్వరలో నగరంలో మార్పు కనిపించాలి.

- నాలుగు రోజుల క్రితం సమీక్షలో మంత్రి నారాయణ వ్యాఖ్యలివి

నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదు. కాలువల్లో ఆయిల్ బాల్స్ వదలడం, ఫాగింగ్ వంటి పనులు ఎందుకు చేయడం లేదు. మీరు చేయలేక పోతే చెప్పండి నేనే రోడ్లపైకి వెళతాను.

- ఇటీవల సమీక్షలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఏంటండీ ఈ చెత్తంతా!. కాలువల్లో క్లీనింగ్ ఇలాగేనా చేసేది? మీకు ఎన్నిసార్లు చెప్పాను? ఇలాగైతే నా దగ్గర కుదరదు. కాలువల్లో మొక్కలు కూడా మొలిచేంతగా సిల్ట్ ఉందంటే చెత్త అస్సలు తీయడం లేదని తెలుస్తోంది. అవసరమైన చోట ప్రైవేటు కూలీలతో శుభ్రం చేయించమని చెప్పినా చేయక పోతే ఎలా!?

- నగర పర్యటనలో కమిషనర్ సూర్యతేజ

ఇలా మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్‌లు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేసింది కార్పొరేషన్ పారిశుధ్య విభాగం సిబ్బంది పనితీరుపైనే. ఒకరు అన్నారంటే అనుకోవచ్చు గానీ ఏకంగా ముగ్గురు ప్రముఖులూ పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తిగా ఉన్నారంటే నగరంలో పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. గడిచిన రెండు, మూడు నెలలుగా మంత్రి నారాయణ నగరంలో పర్యటిస్తున్న సమయంలో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. అయినా మార్పు కనిపించలేదు. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నిస్తూనే, మీరు చేయలేకపోతే నేనే రోడ్డు మీదకు వస్తానంటూ హెచ్చరించారు. అయినా పద్ధతి మారలేదు. ఇటీవల కమిషనర్ సూర్యతేజ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తున్నారు. 'మీకు ఎన్నిసార్లు చెప్పాలి?' అంటూ హెచ్చరిస్తున్నా మార్పు రాలేదు. ఇక నాలుగు రోజుల క్రితం కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహించిన మంత్రి నారాయణ.. పారిశుధ్య విభాగం పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇష్టం లేకపోతే వెళ్లిపోండి.. ఇలాగైతే కుదరదు.. అంటూ హెచ్చరించే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. ఎలాగైనా నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కీలకమైన పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను ఏడీసీకు అప్పగిస్తున్నట్లు ప్రకటించడంలో సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకోవచ్చు.

విపరీతంగా దోమల బెడద

నెల్లూరును స్మార్ట్‌సిటీగా మార్చే క్రమంలో డస్ట్‌బిన్ ఫ్రీ సిటీగా ప్రకటించారు. గతంలో వీధుల్లో ఉన్న చెత్త కుండీలను తొలగించారు. వాటి స్థానంలో ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్తను విడివిడిగా వేసుకునేందుకు డస్ట్ బిన్‌లు అందించారు. ఈ చెత్తను ఏ రోజుకా రోజు ఇంటింటికి వెళ్లి సేకరించేందుకు వాహనాలను కూడా కొనుగోలు చేశారు. ఇందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయితే సకాలంలో ఈ చెత్త సేకరణ జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఉదయాన్నే వాహనాలు వస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్న సమయంలో ఇళ్ల వద్దకు వస్తున్నాయి. అప్పటికే ఉద్యోగాలు, కూలీ పనులకు వెళ్లిపోయిన వారికి చెత్త వేసేందుకు వీల్లేకుండా పోతోంది. ఇటువంటి వారంతా ఇళ్లలో చెత్తను పెట్టుకొని కంపు భరించలేక రోడ్లపై పడేస్తున్నారు. ఇలా రోడ్లపైనే పడేసిన చెత్తను తొలగించడంలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోంది. అలానే ప్రధాన కాలువలతో పాటు వీధుల్లోని కాలువల్లో సిల్ట్ పేరుకుపోయి మురుగు కదలడం లేదు. ఈ కాలువలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలు కూడా ఇందుకు జతకలుస్తుండటంతో నగరంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. అయితే ఈ దోమలను నివారించేందుకు అవసరం మేర ఆయిల్ బాల్స్ వదలడం, ఫాగింగ్ సరిగ్గా చేయకపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్ నగర పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి ఈ సమస్యలే ఎక్కువగా వస్తుండటంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం నిర్వహించే ఐవీఆర్‌ఎస్ సర్వేలో కూడా ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే నగరంలో మార్పు రావాలని మంత్రి ఆదేశించారు. మరి ఇకనైనా పారిశుధ్య విభాగం గాడిన పడుతుందా? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఫత్తేఖాన్‌పేటలో రోడ్డుపై చెత్తాచెదారం



రాజీవ్‌గృహకల్ప వద్ద చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతూ..

న్యూస్ బాక్స్

4న వీఆర్ న్యాయ కళాశాల స్వర్ణోత్సవం

నెల్లూరు(విద్య) : నెల్లూరులోని వీఆర్ న్యాయ కళాశాల 50వ వార్షికోత్సవం సందర్భంగా మార్చి 4వతేదీన స్వర్ణోత్సవ (గోల్డెన్ జూబ్లీ) సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల విద్యార్థులు తెలిపారు. వారు శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్, కళాశాల ప్రత్యేకాధికారి కే కార్తీక్‌ను కలిసి స్వర్ణోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ అందరి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. గోల్డెన్ జూబ్లీ సంబరాల్లో జూనియర్స్ ఆత్మీయ, సీనియర్స్ వీడ్కోలు సభలతోపాటు పలు కార్యక్రమాలకు జేసీ హాజరవుతారని చెప్పారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై కఠినంగా వ్యవహరించండి

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో విద్యుత్ అక్రమ వినియోగదారులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను విద్యుత్ సంస్థ జనరల్ మేనేజర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన తొలుత గూడూరులో విద్యుత్ స్టోర్‌ను పరిశీలించారు. అనంతరం నెల్లూరు విద్యుత్ భవనలో ఎస్ఈ విజయన్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కొంతమంది వినియోగదారులు ఒక కేటగిరికి కనెక్షన్ తీసుకొని మరో కేటగిరికి విద్యుత్‌ను వాడుతున్నారన్నారు. వారందరికీ నోటీసులు సక్రమంగా పంపడం లేదని, దీనిపై అధికారులంతా పకడ్బందీగా వ్యవహరిస్తూ విద్యుత్ అక్రమ వాడకాన్ని నివారించాలన్నారు. రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

గొలుసు చోరీ నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): మహిళ మెడలోని గొలుసు తెంపుకెళ్లిన వ్యక్తిని చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో శుక్రవారం నిందితుడి వివరాలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. వీఎంఆర్ నగర్‌కు చెందిన సొంగ బుజ్జమ్మ జనవరి 4వ తేదీ రాత్రి ఆమె మద్రాసు బస్టాండు సమీపంలోని ఓ నర్సింగ్ హోంలో ఉండగా గుర్తుతెలియని యువకుడు ఆమె మెడలోని 12 గ్రాముల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారంగా నిందితుడు కొరడావీధిలోని బంగారు దుకాణంలో పని చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజగొరిగా గుర్తించారు. నిందితుడు చోరీ చేసిన గొలుసును శుక్రవారం విక్రయించేందుకు వెళుతుండగా చిన్నబజారులో పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అయ్యప్ప, క్రైమ్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో వ్యక్తి మృతదేహం

- మృతిపై పలు అనుమానాలు

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 21: బావిలో వ్యక్తి మృతి చెంది ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. పోలీసుల కథనం మేరకు.. చిన్నచెరుకూరు గిరిజన కాలనీకి చెందిన కోట్ల బాబు(39) ప్లంబింగ్, పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో పదేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో తన కుమార్తెను పోషించుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 17వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన శుక్రవారం చిన్నచెరుకూరు మిక్సిడ్ కాలనీలో ఓ బావిలో శవమై తేలాడు. బావి నుంచి దుర్గంధం రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ వీరేంద్ర బాబు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతుడు బాబు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేదా ఇంకేమైనా జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	93
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8266
వెండి కిలో ధర	రూ. 99,700
వెండి ఒక గ్రాము	రూ.102.70

నకిలీ పురుగు మందు స్ప్రేపై స్పందించిన అధికారులు

కొండాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందు స్ప్రే చేశాం.. పంట నాశనం అయ్యింది అని గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన వార్తపై వ్యవసాయ అధికారులు స్పందించారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా కంది పంట సాగుచేసిన రైతులు ఎస్.తిరుపతిస్వామి, ఎమ్. మాల్యాద్రి, జి.మహేష్ తదితరులతో కలిసి మందు స్ప్రే చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సదరు రైతులు సింజెంటా కంపెనీకి చెందిన ఏంప్లిగో అనే పురుగు మందును (లాంబ్డాసైహలోత్రిన్- 4.6 శాతం మరియు క్లోరాంటానిప్రోల్ 9.3 శాతం జెడ్ సి మిశ్రమం)ను కలిగిరి మండలంలోని శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ షాపులో కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. అలాగే షాపుకు వెళ్లి అదే బ్యాచ్‌కు చెందిన పురుగుమందును పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. రిపోర్టులు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి తెలిపారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సైదా

మాతృభాషను ఆజన్మాంతం కాపాడుకుందాం

- ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి

వెంకటాచలం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాష ఔన్నత్యాన్ని ఆజన్మాంతం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడులో తెలుగు భాషోద్యమకారుడైన ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధిలో ఆయా సంస్థలు, విశ్వవిద్యాలయాలు విశేషంగా కృషి చేయాలని ఉద్ఘాటించారు. ప్రముఖ రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ ఇంటి భాషను వినియోగించడం మానేస్తే మన తల్లిదండ్రులను మరిచిపోయిన ట్లేనన్నారు. అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ షేక్ మస్తాన్ తన సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం విద్యాత్మక, కార్యనిర్వాహక సిబ్బంది, మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ : ముగ్గురికి తీవ్రగాయాలు

కొండాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): చింతలదీవి పంచాయతీ పరిధిలో శుక్రవారం మోటారు సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ వెంకటరావు తెలిపిన మేరకు .. తూర్పుఎర్రబల్లి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి రవీంద్రారెడ్డి భార్య కీర్తన కుమారుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై కొండాపురం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. తూర్పుఎర్రబల్లి నుంచి కొండాపురం వైపు వస్తున్న వడ్లలోడు లారీ కామధేను కేంద్రం మలుపు వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కీర్తన కాలుకు బలమైన గాయమవగా రవీంద్రారెడ్డి, కుమారుడికి రక్తగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కొందరు వీరిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని 108వాహనంలో క్షతగాత్రులను కావలి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ షేక్ భాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన మలుపు వద్ద ఉన్న కంపచెట్లను జేసీబీతో ఎస్ఐ వెంకటరావు తొలగించారు.



గాయపడిన వారిని అంబులెన్స్ ఎక్కిస్తున్న ఎస్ఐ వెంకటరావు

జనావాసంలోకి జింక

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లోని నాయీబ్రాహ్మణ కాలనీలోకి శుక్రవారం ఓ జింక వచ్చింది. స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు దాన్ని పట్టుకొని సమీప అటవీ ప్రాంతంలో వదిలారు. నీటి కోసం వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తాయని, వాటిని కాపాడి సమాచారం ఇవ్వాలని అధికారులు కాలనీవాసులను కోరారు.



జింకను పట్టుకొన్న అటవీ సిబ్బంది

పెంచలకోన అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

- మే నెలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాపూరు/కలువాయి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కోనకు వచ్చిన మంత్రికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారు, అమ్మవార్లకు, ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కోన అభివృద్ధిపై ఆలయ అధికారులతో మంత్రి సమీక్షించారు. మే నెలలో జరగనున్న బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో పెంచలకోన ప్రాంగణంలో అసంపూర్తిగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని, టీడీపీ, ఎమ్మెల్యే కురుగొండ్ల సహకారంతో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులో తెస్తామని అన్నారు. మంత్రి వెంట జిల్లా సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ ధనుంజయరెడ్డి, ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చెన్ను అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● కాగా, అంతకముందు మంత్రి, ఎమ్మెల్యే కలువాయి మండలం దాచూరులో అమరా శ్రీరాములశెట్టి సతీమణి దివంగత అమరా వసుంధరమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆదూరుపల్లి నుంచి పెంచలకోన వరకు రెండు లైన్ల రహదారి అభివృద్ధి విషయం సీఎం చంద్రబాబుతోపాటు ఆర్అండ్‌బీ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాల నాటికి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అలాగే కండలేరు జలాశయం కింద ముంపునకు గురైన పాత దాచూరులోని చెన్నకేశవస్వామి, పోలేరమ్మ ఆలయాలను పునరావాస కేంద్రంలో నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. దాచూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, తాగునీటి ప్లాంటు ఏర్పాటుకు కూడా నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వేలూరు కేశవచౌదరి, దాత అమరా శ్రీరాముల శెట్టి, టీడీపీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, సర్పంచు రాజుల అనురాధ, సోమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పెంచలకోనలో శ్రీవారి ఆలయం వద్ద మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు

వికసిత భారత్, లక్ష్య సాధనకు కృషి చేయండి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్

నెల్లూరు (హరనాధపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు కంటున్న వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో భాగంగా వివిధ పథకాల అమలుకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలో జడ్పీ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. భారతదేశాన్ని విశ్వగురుగా తీర్చిదిద్దే క్రమంలో అమలు చేయాల్సిన విధానాలు, వాటి ద్వారా భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల గురించి వివరించారు. అనంతరం దినకర్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టులు జిల్లాకే కాకుండా సమీప కడప, అన్నమయ్య జిల్లాలకు నీటి వనరులను అందించే సౌలభ్యం ఉందన్నారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా ప్రతి ఇంటిని విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చాలనే ఉద్దేశంతో తయారు చేశారని, ఇందుకోసం విద్యుత్, సెర్ప్, మెప్మా, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్దేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో కృష్ణపట్నం పోర్టు, పూర్తి కావస్తున్న రామాయపట్నం పోర్టు చుట్టుపక్కల ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంచి జిల్లాను స్వర్ణాంధ్రలో భాగస్వామ్యం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుని వికసిత భారత్‌కు బాటలు వేయాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంకా దినకర్, పక్కన కలెక్టర్ ఆనంద్, జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి లంకా దినకర్ పేర్కొన్నారు. నెల్లూరు రామూర్తి నగర్‌లోని వర్చున బిల్డింగ్‌లో శుక్ర వారం బీజేపీ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని రూపొందించారన్నారు. రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ కింద రూ.9,412 కోట్లు కేటాయించారని, స్వయం సహాయక గ్రూపుల కోసం గ్రామీణ క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపరిచారని చెప్పారు. నెల్లూరు జిల్లాకు రూ.2,500 కోట్ల ఎరువుల సబ్సిడీ అందించారని, కిసాన్ సమ్మాన్ యోజన కింద నెల్లూరు రైతులకు రూ.6వేల కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, సహ ట్రెజరర్ కందుకూరు సత్యనారాయణ, న్యాయవాది రంగరాజన్, నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, బైరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'విశిష్ట' నమోదు కోసం

రైతుల అవస్థలు



సచివాలయంలో పడిగాపులు కాస్తున్న రైతులు

లింగసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిమ్మారెడ్డిపాలెం సచివాలయంలో రెగ్యులర్ గ్రామ వ్యవసాయ సహాయకుడు గత కొన్నేళ్ల నుంచి లేడు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మాలకొండరాయుని పాలెం సచివాలయానికి చెందిన వీఏఏ శ్రీహరిని తిమ్మారెడ్డిపాలెం సచివాలయానికి ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం వ్యవసాయ అధికారులు రైతులకు సంక్షేమ పథకాలు అందాలంటే గ్రామ సచివాలయాల్లో విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని తప్పనిసరి అని చెబుతున్నారు. దీంతో గ్రామ రైతులు ఈ సంఖ్యను నమోదు చేసుకునేందుకు గ్రామంలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇతర గ్రామాల్లోని సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామాలకు చెందిన రైతులు మాలకొండరాయునిపాలెం సచివాలయానికి 3 కి.మీ దూరంలో వెళుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు వాహనాల్లో వెళుతుండగా, మరికొందరు నడిచి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎలాగోలా సచివాలయానికి చేరినా అక్కడ రైతులు రద్దీతో పాటు.. ఒక్కోసారి సర్వర్ రాక పోతుండడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని శుక్రవారం పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తిమ్మారెడ్డిపాలెం సచివాలయానికి రెగ్యులర్ వీఏఏను నియమించి రైతులను ఆదుకోవాలని రైతులు ఎం.బాలు ఇంకా పలువురు కోరుతున్నారు.

నేడు సంగంలో ఇద్దరు మంత్రుల పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, టీడీపీ నేతలు



మంత్రుల పర్యటనపై నాయకులతో చర్చిస్తున్న అధికారులు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈమేరకు వారు పీఏసీఎస్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక పీఏసీఎస్ ప్రాంగణంలో ఎన్‌డీసీబీ రూ. 20.5 లక్షల రుణంతో నిర్మించిన గోడౌన్, కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తారని, అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. అదేవిధంగా కలిగిరి రహదారిలో కొరిమెర్ల వద్ద ఉన్న రైస్‌మిల్లును పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం పీఏ అస్రఫ్, డిప్యూటీ కోఆపరేటివ్ అధికారి యలమందలరావు, పీఏసీఎస్ కార్యదర్శి దస్తగిరి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రైస్ మిల్లు పరిశీలన

కాగా, మంత్రుల పర్యటనలో భాగంగా రైస్ మిల్లును పరిశీలించనుండడంతో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ అర్జునరావు శనివారం సంగంలోని రైస్ మిల్లును పరిశీలించారు. అనంతరం ఆయన రైస్ మిల్లు యజమానికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆ శాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించిన రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి



జువ్వలదిన్నె గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్పీ సిసోడియా

బిట్రగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బర్‌ను శుక్రవారం సాయంత్రం ఏపీ రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆర్పీ సిసోడియా పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న తుఫాన్ షెల్టర్ వద్ద స్థానిక పెద్దలు, గ్రామప్రజలతో కాసేపు ముచ్చటించారు. సముద్ర చేపల వేటకు చిన్నబోట్లతో వెళ్లేందుకు తరచూ మరమ్మతులు తలెత్తే అవకాశం ఉందని గంగపుత్రులు తెలిపారు. పెద్ద మరపడవలు మంజూరైతే జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. స్థానిక రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే భూ రీసర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, మండల తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం, రెవిన్యూ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రైతులకు యూనిక్ నెంబరు తప్పనిసరి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ యూనిక్ నెంబరు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రజని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రైతులు ఆధార్ కార్డు, ఒన్‌బి, పాసుపుస్తకం, ఆధార్ లింక్ ఫోన్ నెంబరుతో రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకుని యూనిక్ నెంబరు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందడానికి ఈ నెంబరు తప్పనిసరి అని తెలిపారు.

●అల్లూరు : కేంద్రం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే అన్నదాత సుఖీభవ పథకంతో పాటు వ్యవసాయశాఖ చేపట్టే పథకాలు అందవని మండల వ్యవసాయాధికారి సీహెచ్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో అధికారికంగా రబీ సీజన్‌లో 19348 ఎకరాలకు ఈ-పంట నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేవలం 2,505 మంది మాత్రమే ఈ- కేవైసీ చేసుకున్నారని మిగిలిన రైతులు చేయించుకోలేదన్నారు. రైతు రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా పొందాలన్నారు.

గిట్టుబాటు ధర కోసం నేడు రైతుల ఆందోళన

గుడ్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆధ్వర్యంలో శనివారం కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో రైతులకు పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబయి రహదారిపై గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది యువకులు జీవనోపాధి నిమిత్తం నెల్లూరు వచ్చి జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటూ మోటారుసైకిల్‌పై చుట్టుపక్కల పల్లెల్లో పానీపూరి అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో అఖిలేష్ అనే యువకుడు సంగం మండలంలో పానీపూరి అమ్ముకుని తిరిగి వెళ్తూ తనతో వచ్చిన యువకుడి కోసం సంగం- ముంబయి రహదారి కూడలి సమీపంలో ఉన్న బస్‌షెల్టర్ వద్ద వాహనం నిలిపి ఎదురుచూస్తున్నాడు. ఇంతలో సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీకొంది. దీంతో అఖిలేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ట్రాక్టర్‌ను వెంబడించి డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అప్పుడు డ్రైవర్ మద్యంమత్తులో ఉన్నాడు. ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అఖిలేష్‌ను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జికి దక్షిణం వైపున దిగువ మార్గంలోని రైలు పట్టాలపై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల వివరాల మేరకు పట్టాలపై పడి ఉన్న వ్యక్తి వయసు 35-40ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు బులుగు, పచ్చ, తెలుపు రంగు నిలువు గీతల పొడవు చేతుల చొక్కా, పచ్చరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ రమాదేవి తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపుపై ఫిర్యాదు

కలువాయి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం నుంచి పెద్దఎత్తున అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు శుక్రవారం తహసీల్దారుకు పెన్నబద్వేలి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. యంత్రాలతో కొండను తవ్వి భారీ వాహనాలతో గ్రావెల్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈవిషయాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి కూడా గ్రామస్థులు తీసుకువెళ్లారు.

అగ్గి రేగి బుగ్గవుతున్న బ్యారన్లు

● నష్టపోతున్న పొగాకు రైతులు ● జాగ్రత్తలు పాటించాలంటున్న బోర్డు అధికారులు



బ్యారన్‌లో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

కలిగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పొగాకు వాణిజ్య పంట. సాగుచేయాలంటే రైతుకు కత్తిమీద సాములాంటిదే. సాగులో వాతావరణ పరిస్థితులు ఎంత ముఖ్యమో.. పొగాకు క్యూరింగ్‌లో కూడా అంతే జాగ్రత్తలు అవసరం. రైతులు ఎక్కువ పొగాకును బ్యారన్‌లో లోడు చేయడం, లేదా బ్యారన్ నిర్మించి ఎక్కువకాలం అయితే లోపల నిర్మాణాలు దెబ్బతిని ఉంటాయి. బ్యారన్ పొయ్యి నిర్మాణంపై అమర్చే జల్లెడను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో క్యూరింగ్ సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఇప్పటివరకు ఏడు బ్యారన్లు అగ్నిప్రమాదాలకు గురయ్యాయి.

మోతాదుకు మించి పొగాకు లోడింగ్‌తో ప్రమాదాలు

రెండేళ్లుగా పొగాకు ధరలు అమాంతం పెరగడంతో పాత బ్యారన్‌లను కూడా వినియోగంలోకి తెచ్చి క్యూరింగ్ చేస్తున్నారు. దీంతో బ్యారన్ లోపల నిర్మాణాలు, టైర్లు దెబ్బతిని ఉంటున్నాయి. ఓ బ్యారన్ గల రైతు బోర్డు అనుమతించిన దాని కంటే ఎక్కువగా సాగుచేసినపుడు తోటల్లో దిగుబడులు పెరిగినపుడు, పొగాకు క్యూరింగ్ చేయడానికి తన బ్యారన్ చాలకపోవడంతో మరో బ్యారన్‌లో క్యూరింగ్ చేయాల్సి ఉంది. ఎక్కువ దిగుబడులు వచ్చినపుడు రైతులు మరో బ్యారన్‌లో క్యూరింగ్ చేయాలంటే రవాణా, బ్యారన్ అద్దె, డ్రైవర్ ఖర్చు ఇలా సుమారు రూ.50వేల వరకు అదనంగా అవుతుంది. ఈ కారణంతో కొంతమంది రైతులు బ్యారన్‌లో మోతాదుకి మించి పొగాకు లోడింగ్ చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొగాకు బ్యారన్ క్యూరింగ్ సమయానికి బ్యారన్ నిర్మాణం పటిష్టంగా ఉంచుకోవ డంతోపాటు బోర్డు అధికారులు సూచించే ప్రకారం ప్రకారం పొగాకును లోడింగ్ చేయాలి. క్యూరింగ్ చేసే సమయంలో డ్రైవర్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించుకోవచ్చని బోర్డు అధికారులు తెలియజేస్తున్నారు.

తెలుగు తల్లికి వందనాలు



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): తెలుగుతల్లికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయ బృందం

ఆత్మకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం తెలుగుభారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, సహాధ్యక్షుడు కొల్లి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు, ఎస్ యానాదిరెడ్డి, ఎస్‌వి చలమయ్య, కెవి శేషారెడ్డి, వి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృభాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో-2 శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. మండలంలోని జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెం పాఠశాలలను తనిఖీచేసి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ నాయ బ్, లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : స్థానిక ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. తెలుగు పద్యాలు, సూక్తులను చార్టుల ద్వారా ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు డీ వీరభద్రయ్య, తెలుగు ఉపాధ్యాయిని కె సుభద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య, కవిత వివిద రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థినులు ఒకే వర్ణం కలిగిన ఓణీలు ధరించి నృత్యం చేశారు.

●కందుకూరు : ఓగూరు సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత తెలుగు పండితుడు వేదాంతం భాస్కరమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యపోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామారావు, తెలుగు ఉపాధ్యాయుడు ఇనకొల్లు మస్తానయ్య, హెచ్ఎం గడ్డం బాబూరావు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సంగం: ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లులో ఉన్న కామాక్షిదేవి సమేత భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని పుర స్కరించుకుని అందచేసే కొడిముద్ద కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ ఉత్సావాలు 28వ తేదీ వరకు జరగనున్నాయి. కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి రోజుకో వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అందులో భాగంగా రాత్రికి శేష వాహనం, 22న హంస వాహనం, 23న సింహ వాహనం, 24న రావణసేవ, 25న నందిసేవ, 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని కల్యాణ మహోత్సవం, లింగోదర్భవ అభిషేకములు, 27న గిన్నెభిక్ష, ధ్వజావరోహణము, 28న శేషవాహన గ్రామోత్సవం, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

●కావలిటౌన్ : స్థానిక పాతూరులోని రుద్రపాద క్షేత్రంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు (కుంభమాస తిరునాళ్ల) శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శివాలయ వంశ పారంపర్య ప్రధాన అర్చకులు శశి గురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాలు మార్చి 2వ తేదీన ముగియనున్నాయి. ఉదయం వాస్తుహోమం, వాస్తుబలి విశేష అభిషేకార్చనలు పూజలు సాయంత్రం ధ్వజారోహణం చేపట్టారు. రాత్రి మల్లన్నకు శేషసేవలతో నిర్వహించిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీభూమిక నృత్యకళా నిలయంకు చెందిన చిన్నారులు కూచిపూడి, భరతనాట్యంతో అలరించారు.

రాయితీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు



అల్లూరు : దరఖాస్తులు పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు, కమిషనర్ ఉమామహేశ్వరరావు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ, కాపు, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సంగం స్టేట్ బ్యాంక్ పరిధిలోని సంగం, పెరమన, కోలగట్ల, వీర్లగుడిపాడు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూలకు స్టేట్ బ్యాంక్ మేనేజర్‌తోపాటు మండల, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 యూనిట్లకు 247 మంది దరఖాస్తు చేసుకోగా, హాజరైన 95 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, కెనరా బ్యాంక్ మేనేజర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

●అల్లూరు : బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూసీ సామాజిక వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించిన ఇంటర్వ్యూను శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అన్ని బాంకుల మేనేజర్లు పాల్గొని 145 మంది లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. సచివాలయం-1 ఇన్‌చార్జి కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

కావలిలో 24న ఇంటర్వ్యూలు

కావలి రూరల్ : బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల దరఖాస్తు దారులకు ఈనెల 24న ఎమ్పీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎమ్పీడీవో శ్రీదేవి శుక్రవారం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుణాల కోసం 600మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కె వెంకటసుబ్బయ్య, క్షయవ్యాధి నివారణ అధికారి భోగ్యం వెంకటేశ్వర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, దగ్గు ఉంటే వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండా లన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు శివ రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం ఆయన జమీన్‌ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పల్ శ్రీవెంకటేశ్వర్, నలదలపూరు హైస్కూల్ హెచ్ఎం బీరకాయల మాధవరావు ప్రత్యేకాధికారి గోవర్ధిని పాల్గొన్నారు.

పీ-4 సర్వేలో సమగ్ర సమాచారం సేకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఉప గణాంకాధికారి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 సర్వే సక్రమంగా నిర్వహించాలని కందుకూరు డివిజన్ ఉప గణాంకాధికారి కె శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం వరికుంటపాడు సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సర్వే సిబ్బంది ఇంటింటినీ సందర్శించి ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, ఏఎస్‌వో భక్తవత్సలంపాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పక చేయించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

కావలి టౌన్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిం చుకోవాలని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మి తెలిపారు. శుక్రవారం జెబీ నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్తేర్ బ్యూలా అధ్యక్షతన నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్‌ను ప్రాథమికదశలో గుర్తిస్తే దానిని నివారించవచ్చు అన్నారు. మొదటి, రెండో దశలో ఎలాంటి నొప్పి ఇబ్బంది ఉండదని మూడు, నాలుగు దశల్లో నొప్పి ఇబ్బంది ఉంటుందన్నారు. జంక్ ఫుడ్స్, మరలా కాగిన నూనెలతో వండిన వంటలు, కృత్రిమ రంగులతో తయారు చేసిన పదార్థాలు తినేటపుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చిన్న వయసులో ఉండే వారు క్యాన్సర్ వ్యాక్సిన్ గడువు ప్రకారం వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెబీ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● రామ సిద్ధార్థ, ఫైర్ ఆఫీసర్



కావలి రూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అగ్ని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని కావలి అగ్నిమాపక శాఖ కేంద్ర అధికారి జి.రామ సిద్దార్థ తెలిపారు.

?ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.

! వైద్యశాలలు, పెట్రోల్ బంక్‌లు, విద్యాసంస్థలతో పాటు రైతులకు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా, లేవా తనిఖీ చేస్తూ పరికరాల వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం.

? కార్యాలయ నూతన భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారా.

! అగ్నిమాపక కేంద్రం భవనాలు 69 సంవత్సరాల కిందట నిర్మించినవి కావటంతో వర్షాలకు నీరు ఒడుస్తున్నాయి. రూ.2కోట్లతో నూతన భవనం, ఫైర్ ఇంజన్ వాహనానికి ప్రత్యేక గ్యారేజీ ఏర్పాటు, తదితర ఇతర అవసరాల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

? రెస్క్యూ పరికరాలు ఉన్నాయా.

! కొన్ని పరికరాలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో అధునాతన పరికరాల కొనుగోలుకు నివేదికలు సిద్ధంచేశాం. ఉన్నతాధికారులకు పంపి వాటి నుంచి నిధులు మంజూరైన వెంటనే ఆ పరికరాలను కొనుగోలు చేస్తాం.

న్యూస్ బాక్స్

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

బిట్రగుంట, ఫిబ్రవరి 21. (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పనులు ఊపందుకున్నాయి. స్వామి ఆలయానికి వేళ్లే ప్రధాన ముఖద్వారానికి రావి చిన్నరంగయ్య యాదవ్ కొత్తరంగులను వేయించారు. శుక్రవారం ముస్తాబైన ముఖద్వారం వద్ద విజయ్‌కుమార్, చిన్నపెంచలయ్య, పెద్ద రంగయ్యలు దిష్టితీత కార్యక్రమం చేపట్టారు.

రూ.300 వేతనం కల్పించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధికూలీలకు దినసరి వేతనం రూ.300 వేతనం కల్పించేలా పని చేయించాలని ఉపాధిహామీ ఏపీడీ బాబూరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఏపీడీ బాబూరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ కే. టీ ఉమామహేష్, ఈసీ వంశీకృష్ణ, టీఏలు మాలకొండయ్య, ప్రసాద్, అశోక్, నాగార్జున, చినమాల కొండయ్య పాల్గొన్నారు.

సైన్స్‌డే వారోత్సవాలు ప్రారంభం

కావలిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం సైన్స్‌డే వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ శివకుమార్, ఖాదర్ బాష, సుబ్బరాయశర్మ, శారద, రమణయ్య, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాలేజి వార్షికోత్సవం

బిట్రగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తిప్పలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంఈవోలు నరసింహరావు, జయమ్మలతో పాటు టీడీపీ మండలకన్వీనర్ ఎం.నాగేశ్వరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పలు పాఠశాల హెచ్ఎంలు హాజరయ్యారు.

● దగదర్తి, (బిట్రగుంట) : విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని టీడీపీ యువనేత మాలేపాటి భాను చందర్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలో ఆయన పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేపల కృష్ణ, వడ్డే వినయ్, గోపాల్, నాగూర్, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు ఉన్నారు.

వీఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

వింజమూరు : పట్టణంలోని వెంగమాంబ నగర్‌లో ఉంటున్న మాజీ వీఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వరరావును ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పరామర్శించారు. అనారోగ్యంతో ఉన్న దంతులూరిని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

గౌతమ్‌రెడ్డికి ఘన నివాళి

ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి): దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి వర్ధంతిని శుక్రవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లరెడ్డి అనసూయమ్మ, ఆనందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు ఏసీ!

● కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం మొదలైనందున పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లలో ఏసీ సదుపాయం కల్పించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌లో ఆహార పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నాయని, క్యాంటీన్‌కు వచ్చేదంతా పేదలే కావడంతో వారికి ఉక్కపోత లేకుండా ఏసీలను అందుబాటులోకి తీసుకురావాలని, చల్లటి తాగునీటిని అందించాలని సూచించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కాగా, కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఏడీసీ నందన్ సమీక్ష జరిపారు. నగరంలోని అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. డివిజన్లు, సచివాలయాల వారీగా ఈ కార్యక్రమం జరగాలని ఆదేశించారు.



క్యాంటీన్‌లో ఆహార పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

రేపు 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు బీ.కేశవరావు, మండల ప్రధాన కార్యదర్శి బీ.సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్ మండ లాల్లో మండ లస్థాయిలో ఇంగ్లీషు, తెలుగు మీడియం లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి నెల్లూరు విశ్వసాయి విద్యా సంస్థలో ఫీజు ఉచితంగా, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి 75 శాతం రాయితీ, మూడు తృతీయ ర్యాంకు సాధించిన విద్యార్థికి 50 శాతం రాయితీ ఇప్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

వెంకటాచలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట ఎస్టీ కాలనీలో శుక్రవారం వీఎస్‌యూ ఆధ్వర్యంలో గ్రామీణ సామాజిక విముక్తి సంస్థ సహకారంతో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివా హాలు.. వాటి ప్రభావాలను వివరిస్తూ బాలికల విద్యకు ప్రాధాన్య తపై వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సామాజిక విభాగం అధ్యాపకుడు డాక్టర్ బీ వెంకటసుబ్బారెడ్డి, విద్యార్థులు దివ్య, బాలస్వామి, జ్యోతి తదితర లు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం : బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని వైద్యాధికారి డాక్టర్ వినయ్ తెలిపారు. శుక్రవారం జొన్నవాడ తిప్ప గిరిజనకాలనీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు కందికట్టు పెంచలయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో సాయిప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా సాయిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరు రెగ్యులర్ ఎంపీడీవో నరసింహారావు ఈనెల 1వ తేదీ నుంచి అనారోగ్యం కారణంగా సెలవుపై ఉండడంతో కొడవలూరు మండలం నుంచి బదిలీపై సాయిప్రసాద్ పొదలకూరుకు వచ్చారు. మండలంలోని సమస్యలపైన దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వెలుగు సీసీల ఘర్షణపై విచారణ

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగు కార్యాలయంలో తోటపల్లి గూడూరు సీసీ తిరుపతమ్మ, సౌత్ ఆములూరు సీసీ రాజేశ్వరీలు బాహాబాహికి దిగిన ఘటనపై విచారణ చేపట్టినట్లు డీఆర్‌డీఏ ఏసీ మధు తెలిపారు. వీరి ఘర్షణ పై శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'సీసీల ఘర్షణ' కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు విచారణ జరపాలని ఆశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారని, దీంతో విచారణ ప్రారంభమైందని ఆయన తెలిపారు.

మీసేవ సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మీసేవ అసోసియేషన్ నాయకులు శుక్రవారం అమరావతి సచివాలయ ఐటీ శాఖ కార్యాలయంలో గ్రామ, వార్డ్ సచివాలయ డైరెక్టర్ ఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో అదనపు కమిషనర్ రాంనాద్‌రెడ్డిని కలిశారు. మీసేవ సమస్యలు, సర్వీస్ ప్రొవైడర్స్‌తో కలుగుతున్న ఇబ్బందులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీసేవ అసోసియేషన్ ప్రతినిధులు అనిల్‌కుమార్, హమీద్, రవి, అంజన్, సారథి, పాపారావు గుప్తా, సత్య తదితరులు పాల్గొన్నారు.



కసుమూరులో మోటర్ చోరీ

వెంకటాచలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు పంచాయతీ వడ్డీపాళెంలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ మోటర్ చోరీకి గురైంది. దీంతో శుక్రవారం వెంకటాచలం పోలీసులకు రైతు బెల్లంకొండ గోపి ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన మోటర్ విలువ సుమారు రూ.20 వేలు వరకు ఉంటుందని బాధిత రైతు వెల్లడించారు. చోరీల నివారించకుంటే ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విధ్వంసం నుంచి పూర్వవైభవం దిశగా ఏపీ

● షర్మిల వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విధ్వంసకర పాలన నుంచి బయటపడిన ఏపీ కూటమి ప్రభుత్వ పాలనలో పూర్వవైభవం దిశగా ముందుకు సాగుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాకుటూరులో రూ.15లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ రహదారిపై భారీ మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖలు మూతపడ్డాయన్నారు. వైసీపీ నేతలు పనులు చేయకుండానే బిల్లులు చేసేసుకున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న కాకాణిగోవర్ధన్‌రెడ్డి కలెక్షన్లలో మునిగితేలితే, ఇరిగేషన్ మినిస్టర్ డాన్సులకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి తోడబుట్టిన చెల్లెలు మాటలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఐదేళ్ల చేసిన పాపాలకు కాకాణి లాంటి వారు నోరుమూసుకుని ఉండాలని, దమ్ముంటే షర్మిల చేస్తున్న వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పరువు రాష్ట్రం, దేశంలోనే కాదు ఇంట్లో కూడా పోయిందన్నారు. వీఎస్‌యూ కోసం భూములు త్యాగం చేసిన రైతుల్లో గత టీడీపీ హయాంలో ఏడుగురికి ఉద్యోగాలు ఇప్పించామని, వైసీపీ హయంలో కాకాణి అండ్ బ్యాచ్ 69 ఉద్యోగాలు అమ్ముకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, సర్పంచు డబ్బుగుంట వెంకమ్మ, నాయకులు బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమనాయుడు, కంచి శ్రీనివాసులు యాదవ్, కోదండయ్యనాయుడు, డబ్బుగుంట సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పోలీసు శాఖకు శ్వాస పరీక్ష పరికరాల వితరణ

● ఎస్పీకి అందజేసిన రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్వాస పరీక్ష పరికరాలు(బ్రీత్ అనలైజర్స్) ఆరింటిని అందజేసింది. వీటిని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కే కృష్ణకాంత్‌కు రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి అందించారు. ఇటీవల నిర్వహించిన రోడ్డు భద్రతా సమావేశంలో కలెక్టర్ ఆనంద్ సూచన మేరకు ఈ బ్రీత్ ఎనలైజర్లను అందించామని చైర్మన్ తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించటంలో రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ ముందుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి వైఎస్ చైర్మన్ జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్ కుమార్‌జైన్, సభ్యులు శ్రీహరిరెడ్డి, సురేష్, కార్యాలయం కార్యదర్శి మస్తానయ్య, సీఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి బ్రీత్ ఎనలైజర్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్, సభ్యులు

కామాక్షితాయికి నిత్య కల్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం గంగా కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకిసేమ నిర్వహించారు. రాహుకాలం సమయంలో మహిళలు దీపారాధనలు చేశారు. అనంతరం భక్తులు మల్లికార్జునస్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

సకాలంలో రిజిస్ట్రేషన్లు చేయండి

● రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

● 15 రోజుల్లో పరిష్కరిస్తాం : డీఐజీ

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లో సమయపాలన పాటించాలని కోరు తూ డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం నగరంలోని రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రతీరోజు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు ఆలస్యంగా చేస్తున్నారని, ప్రతి దానికి కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఏకే నగర్‌లోని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కార్యాలయానికి చేరుకుని డీఐజీ పుష్పలతకు సమస్యను వివరించారు. 15 రోజుల్లో పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. దీంతో రైటర్లు శాంతించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ ఉదయం రిజిస్ట్రేషన్ కోసం దస్తావేజులు సమర్పిస్తే సాయంత్రానికి కూడా పని పూర్తి కావడంలేదని ఆరోపించారు.

మాతృభాషను గౌరవిద్దాం : వీఎస్‌యూ రిజిస్ట్రార్



వీఎస్‌యూలో మాట్లాడుతున్న వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత



కవి మెట్టు రామచంద్ర ప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్

వెంకటాచలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించాల్సిన అవసరం ఉందని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శుక్రవారం తెలుగుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. మాతృభాష సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబమని, భవిష్యత్తుతరాలకు భాష వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భాష మాత్రమే కాదని, భాషతో కూడిన భావజాలాన్ని, జ్ఞానాన్ని కూడా తరతరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమారెడ్డి, తెలుగు శాఖ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం త్యాగరాజు, సుభద్రాదేవి, డాక్టర్ ఈశ్వరమ్మ, అవ్వారి శ్రీధర్‌బాబు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ విమల, డాక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో మాతృభాషా దినోత్సవం

నెల్లూరు(విద్య): నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాతృభాషా దినో త్సవం నిర్వహించారు. ప్రముఖ కవి మెట్టు రామచంద్రప్రసాద్ అతిథిగా హాజరై ప్రసంగించారు. మాతృభాష విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకుని మాతృభాషలో అధ్యయనం చేయడం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వం పొందుతారని చెప్పారు. ప్రాచీన తెలుగుభాష, సాహిత్య పరిరక్షణకు ప్రభుత్వం, ప్రజలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, అధ్యాపకులు డాక్టర్ వీ చెంచురామయ్య, డాక్టర్ ఎస్ సురేంద్ర, డాక్టర్ కే కరుణశ్రీ, డాక్టర్ కేవీ సత్యనారాయణ, డాక్టర్ ఐ.సుభాషిణి, డాక్టర్ వై దివ్య, డాక్టర్ మక్బుద్‌బాషా పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద చిక్కుకున్న వాహనం

● స్తంభించిన ట్రాఫిక్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాగుంట లే అవుట్ రైల్వే అండర్ బ్రిడ్జిలో శుక్రవారం భారీ వాహనం ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వరికోత మిషన్ తరలిస్తున్న వాహనం అండర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి మిషన్ పైభాగం ఎత్తుగా ఉండి బ్రిడ్జి కిందనుంచి వెళ్లడానికి వీలు కాలేదు. వాహనం అటూ.. ఇటూ కదలకుండా ఇరుక్కుపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఇరుక్కుపోయిన వాహనాన్ని బయటకు తీసి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వాహనం

మసీదు ప్రారంభం

విడవలూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివర్తి కండ్రిగలో చెన్నైకి చెందిన ముస్లిం మతపెద్దలు, స్థానిక ముస్లింల సహకారంతో నిర్మించిన మసీదును శుక్రవారం ప్రారంభించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా స్థానికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబరు ఎస్‌.కె. రఫీ, టీడీపీ మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సింహాద్రి అయ్యప్ప, ముస్లింలు పాల్గొన్నారు.

నాలుగేళ్ల పోరాట ఫలితమే ఫ్లైవోవర్

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కనుపర్తిపాడు వద్ద జాతీయ రహదారిపై ఫ్లైవోవర్ వంతెన నిర్మాణం వెనుక నాలుగేళ్ల పోరా ట కష్టం ఉందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 20వ డివిజన్ ఇస్కాన్‌సిటీ వద్ద రూ. 40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానికుల కష్టాలు తీర్చేందుకు మరిన్ని నిధులు కూడా వెచ్చిస్తామని ప్రకటించారు. కాగా, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టిన గడప గడప కార్యక్రమం మంగళ వారం మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో జరిగింది. ఇందు పూరు శ్రీనివాసులురెడ్డి, అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మభాష అజరామరం : శిరోమణి శర్మ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మన అమ్మ భాష తెలుగు అజరామరం అని విశ్రాంత అధ్యాపకుడు ఆలూరు శిరో మణిశర్మ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినో త్సవం సందర్భ ంగా పప్పులవీధి నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. పాటలు, పద్యాలతో గళార్చన చేశారు. పిల్లలతో తెలుగు పద్యాలు, శ్లోకాలు చెప్పించారు. హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయినులు శిరోమణి శర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమ సమన్వ యకర్త గాండవరం శ్రీనివాసులురెడ్డి, భాషాభిమానులు శ్రీరాములురెడ్డి, దామోదర్, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కుష్ఠు' బాధితులకు నిత్యావసరాల వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలంలోని ఆమంచర్ల లెప్రసీ కాలనీలో శుక్రవారం 35 కుష్ఠు వ్యాధి కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. కార్యక్రమాన్ని అబైండింగ్ హోప్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కుమార్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ మారెళ్ల సంయుక్తంగా నిర్వహించారు. డాక్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్, శశి, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

25న ఘంటసాల వర్ధంతి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : శాంతి కల్చరల్స్ ఆధ్వర్యంలో ఈనెల 25న పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వ రరావు వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని సంస్థ నిర్వాహకుడు అమానుల్లాఖాన్ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. వర్ధమాన సమాజం భవనంలో సాయంత్రం 4 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కేతా సుబ్బారావు, అంకిరెడ్డి, రఘురామి రెడ్డి, ఫ్రాంసిస్, విన్నకోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీన వర్గాలపై మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ షేక్ ఇంతియాజ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని బర్కస్ మసీదులో ఆయన అభినందన సభ జరిగింది. మసీదు కమిటీ సభ్యులు ఇంతియాజ్‌ను సత్కరించారు.

మాజీ మంత్రి గౌతమ్‌రెడ్డికి నివాళి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నగరంలోని గౌతమ్‌రెడ్డి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా వైసీపీ సీని యర్ నాయకుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలిసారు.



న్యూస్ బాక్స్

నేడు మంత్రులు, ఎంపీ రాక

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం రామ నారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం బుచ్చిలో పర్యటించనున్నారు. బుచ్చిరెడ్డిపాళెం జెండాదిబ్బ వద్ద ఉన్న సివిల్ సప్లైస్ గోదామును వారు పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి శుక్రవారం పరిశీలించారు.

నేడు మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ విజయ్‌కుమార్ శనివారం నెల్లూరులో పర్యటిస్తారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకట రమణ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. చైర్మన్‌కు మాలల సమస్యలు తెలియజేసి పరిష్కరించాలని కోరుతామన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం, శెట్టిగుంట రోడ్డు, రామ్మూర్తి నగర్, తెలుగుగంగ కాలనీ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజనకాలనీ, లక్ష్మీపురం, శెట్టిగుంటరోడ్డు, జాకీర్‌హుస్సేన్ నగర్, బాలాజీనగర్, ఏసీ నగర్, పూలే బొమ్మ ప్రాంతం, శివాజీ నగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్‌టీటీ నగర్, డ్రైకాస్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

స్టేడియంలో స్వచ్ఛ దివస్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ దివస్ వారోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘాలన్నింటినీ ఐక్యం చేసి అందరి సహకారంతో స్టేడియం పరిసరాలు శుభ్రపరిచారు. స్వచ్ఛతపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యం, కార్యదర్శి స్నేహ సురేష్, వాకర్స్ సంఘాల నాయకులు వేలూరు రంగారావు, నలుబోలు బలరామయ్య నాయుడు, డాక్టర్ కృష్ణమూర్తి, శ్రీనివాసకుమార్, అరి గెల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం కోసం గాలింపు

వెంకటాచలం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలోని సర్వేపల్లి కాలువలో కొట్టుకుపోయిన గుర్తుతెలియని మహిళ మృతదేహం కోసం శుక్రవారం పోలీసులు కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. కాలువలో నీటిపై తేలాడుతూ పోయిన మృతదేహం ఏ వైపునకు కొట్టుకుపోయిందో, ఎక్కడ ఉందో తెలియలేదు. ఒకవేళ సర్వేపల్లి కాలువ ద్వారా రిజర్వాయర్‌లోకి ఏమైనా కొట్టుకుపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆదిశగా గాలింపు చర్యలు చేపట్టారు.

అట్టహాసంగా స్పోర్ట్స్ డే

ముత్తుకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీబీఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్ 22వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్ శైలజారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడా జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనగా విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జ్ శివరామిరెడ్డి, పీఈటీ బాపనపాటి ప్రకాష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం


బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : పెనుబల్లిలో గమళ్లపాళెంలోని వినాయకుడి ఆలయం వద్ద వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. జొన్నవాడ ప్రసాద్ సహకారంతో ఈ వేడుక జరిగింది.

రేపు పింఛనుదారుల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీవీ నగర్‌లో ఉన్న పెన్షన్ భవనంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్స్ సంఘం జిల్లా సమావేశం ఉదయం 9గంటలకు జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకారం

నెల్లూరు (సాంస్కృతికం) : జామియా మసీదుకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సభ్యులు శుక్రవారం పదవీస్వీకార ప్రమాణం చేశారు. కమిటీ సభ్యులు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీని మైనార్టీ నాయకులు అభినందించారు.



భక్తుడికి తొలిపూజ



ముక్కంటి ఆలయం నుంచి కొండపైకి చేరుకుంటున్న భక్తకన్నప్ప ఉత్సవమూర్తి - కన్నప్ప గుడి వద్ద ధ్వజారోహణం చేపడుతున్న వేదపండితులు

- ఆగమోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం
- శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భక్తుడికే తొలిపూజ అందింది. శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం భక్తకన్నప్పకు ఆగమోక్తంగా ధ్వజారోహణం జరిగింది. తనకు పరమభక్తుడైన కన్నప్పకు కొండపై స్థానం కల్పించి తొలి పూజ చెందేలా శివుడు వరమిచ్చాడని పురాణోక్తి. అందుకనే మహాశివరాత్రి ఉత్సవాల్లో తొలిగా కన్నప్పకు ధ్వజారోహణం నిర్వహించడం ఆనవాయితీ. తొలుత ముక్కంటి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కన్నప్ప ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అభిషేక పూజలు నిర్వహించాక మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ముక్కోటి దేవతలకు సంకల్ప పూజలతో వేదపండితులు ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. ధ్వజారోహణ క్రతువులో భాగంగా కన్నప్ప ధ్వజస్తంభానికి పూజలు చేశారు. అనంతరం దర్భమామిడి ఆకులతో కట్టిన తెల్లదారంతో ధవళపతాకం, పూలహారాన్ని ఎగురవేసి హారతులను సమర్పించి ఉత్సవాలకు అంకురార్పణ పలికారు. అనంతరం కన్నప్ప ఉత్సవమూర్తిని ముక్కంటి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సన్నిధివీధిలో బోయ కులస్థులు ఏర్పాటు చేసిన విడిది మండపంలో కొలువుదీర్చారు. సంప్రదాయం ప్రకారం ఉభయదారులైన బోయలు వస్త్రం, నైవేద్యం సమర్పించాక గ్రామోత్సవం ప్రారంభమైంది. సన్నిధివీధి నుంచి రాజగోపురం వరకు, అటు నుంచి చతుర్మాడ వీధుల్లో కన్నప్ప గ్రామోత్సవం సాగింది. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో తొలి రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు గ్రామోత్సవాన్ని దర్శించుకున్నారు. ఇక, స్వామివారి ధ్వజారోహణకు ముందు ఆలయంలో వాస్తు పూజ చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయంలోని అద్దాల మండపం వద్ద పూజలు నిర్వహించి, వాస్తు శాంతి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ అధికారులు, బొజ్జల బృందమ్మ తదితరులు పాల్గొన్నారు. ధూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను శుక్రవారం ప్రారంభించారు.



పురవీధుల్లో ఊరేగుతున్న భక్తకన్నప్ప

ముక్కంటి బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8.30 గంటలకు వెండి అంబారీ సేవ
- 12.30 నుంచి స్వామివారి ధ్వజారోహణం
- రాత్రి 8 గంటలకు వెండి అంబారి సేవ



ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

బ్రహ్మోత్సవ శోభ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఎటు చూసినా పూల అలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలతో పట్టణమంతా బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఆలయ ద్వారాలపై భిక్షాల గాలి గోపురం, సుపథ మండపం వద్ద పూలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, ఆలయం లోపల ధ్వజస్తంభం, దక్షిణామూర్తి సన్నిధి, స్వామిఅమ్మవార్ల సన్నిధిలో ఉత్సవ కళ ఉట్టిపడింది. పట్టణంలోని ప్రధాన మార్గాలతో పాటు చతుర్మాడవీధులు అరటిచెట్లు, మామిడి తోరణాలతో కళకళలాడుతున్నాయి.





ఆలయంలో అలంకరణలు - ఆకర్షణీయంగా దర్శనమిస్తున్న ధ్వజస్తంభం

'తొక్కిసలాట' ఘటనపై
రెండో దశ విచారణ

- తిరుపతికి చేరుకున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జనవరి 8న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై రెండో దశ విచారణ శనివారం నుంచి మొదలు కానుంది. ఆ ఘటనలో ఆరుగురు మృతి చెందడం, 46మంది గాయపడటంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుదది. ఈ ఘటనపై నిజనిజాలు వెలికి తీయాని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మొదటిదశలో పలువురిని విచారించింది. రెండో దశ విచారణకు గాను శుక్రవారం రాత్రి న్యాయవిచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. శనివారం తొక్కిసలాటలో గాయపడిన బాధితులతో పాటు మృతి చెందిన ఆరుగురు కుటుంబసభ్యుల నుంచీ వివరాలు సేకరించనున్నారు. పద్మావతిపార్కు ఎదురుగా ఉన్న 20 దుకాణాల నిర్వాహకులను విచారిస్తారు. పదిరోజులు సుదీర్ఘంగా తొక్కిసలాట ఘటనపై కమిటీ విచారించింది.ఇప్పటికే 70మందికి నోటీసులు జారీ చేశారు. బాధితుల విచారణానంతరం సస్పెండైన డీఎస్పీ, గోశాల డైరెక్టర్, బదిలీ అయిన ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమితో పాటు ఆయా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న రెవెన్యూ తహసీల్దార్లు, కీలకమైనపోలీసు అధికారులను విచారించనున్నారు.

రేపు సీఎం చంద్రబాబు రాక



అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష

తిరుపతి/రేణిగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం రేణిగుంట రానున్నారు. ఉదయం 8 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన తూకివాకం సమీపంలోని ఆర్‌పీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరు కానున్నారు. వధూవరులను ఆశీర్వదించిన అనంతరం విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు. విమానాశ్రయం వద్ద, ఫంక్షన్ హాలు, ఆ రోడ్డు మార్గంలో భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇతర అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సమీక్షలు నిర్వహించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, జిల్లా అధికారులు, విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దారు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, అధికారికంగా సీఎం చంద్రబాబు పర్యటన ఇంకా ఖరారు కాలేదు.

ఏఎస్పీ ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు

తిరుమల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గతంలో తిరుమల డీఎస్పీగా అధికార హోదాను దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలున్న, ప్రస్తుత ఏఎస్పీ టీటీ ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్పీగా విధులు నిర్వహించిన సమయంలో అనుచిత ప్రవర్తనతో పాటు పలు నిబంధనలు ఉల్లంఘించనట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. తన వ్యక్తిగత పనులకు సిబ్బందిని వాడుకున్నారనే విమర్శలు వచ్చాయి. వీటన్నింటికి సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను కూడా సమర్పించిన క్రమంలో క్రమశిక్షణ చర్యల నిర్ణయం తీసుకున్నామని ఆ జీవోలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లోపు ప్రభాకర్ బాబు తన వాదనను లిఖితపూర్వకంగా సమర్పించాలని జీవోలో స్పష్టం చేశారు. ప్రస్తుతం అదనపు ఎస్పీ హోదాలో సెలవుపై ఉన్న ప్రభాకర్‌బాబుపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు.

అసైన్డ్ భూముల్లో గ్రావెల్ తరలించే
హక్కు ఎవరికీ లేదు

తిరుపతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'దొరవారిసత్రం మండలం పూలతోటమిట్టలో గ్రావెల్ తరలిస్తున్న భూములు సీజేఎఫ్ఎస్ నుంచి అసైన్డ్‌గా మారినవి. ఈ భూముల్లో గ్రావెల్‌ను తరలించే హక్కు ఎవరికీ లేదు' అని ఆ మండల తహసీల్దారు శైలాకుమారి స్పష్టంచేశారు. కొన్ని రోజులుగా గ్రావెల్ తరలిస్తున్న ఆ భూములను శుక్రవారం ఆమె రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలతో పాటు, ఆ భూముల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలియజేశారు.



గ్రావెల్ తరలించే అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు శైలాకుమారి

బాలలూ... ఇస్రో పిలుస్తోంది

- ఇస్రో యువికా 2025 దరఖాస్తుల ఆహ్వానం

సూళ్లూరుపేట,ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత, మేధస్సును వెలికితీసి, ప్రత్యేక శిక్షణనిచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇస్రో అవకాశం కల్పిస్తోంది. దీనికోసం యువ విజ్ఞాని కార్యక్రమం (యువికా) పేరిట 2025 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల24 నుంచి మార్చి 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్స్‌లో తెలిపింది. 'క్యాచ్ దెమ్ యంగ్' పేరిట రెండు వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో అంతరిక్ష, సాంకేతికత, విజ్ఞానం, అప్లికేషన్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. విద్యార్థి దశలోనే విజ్ఞానం, సాంకేతికత, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్ (స్టెమ్) అంశాలపై అవగాహన కల్పించి తద్వారా వారిని అంతరిక్ష పరిశోధనల వైపు దృష్టి మళ్లించడమే దీని లక్ష్యం.

చిన్నారుల హాహాకారాలు



బోల్తాపడ్డ బస్సులో నుంచి చిన్నారులను బయటకు తీస్తున్న స్థానికులు

నవ్వుతూ, కేరింతలతో బస్సులో వస్తున్నారా చిన్నారి విద్యార్థులు. ఒక్కసారిగా బస్సు కుదుపుతో ఆందోళన చెందారు. ఆపై బోల్తాపడిన బస్సులో నుంచి చిన్నారుల హాహాకారాలు మిన్నంటాయి. శుక్రవారం ఉదయం తడ మండలం కరిపేటికాలువ బ్రిడ్జిపై వెళుతున్న నారాయణ విద్యాసంస్థల స్కూల్ బస్సు టైర్ల వద్ద కట్టలు విరిగిపోవడంతో అదుపు తప్పి రైలింగ్‌ను ఢీ కొని 15 అడుగుల లోతులో రోడ్డు పక్కకు వెళ్లి బోల్తా కొట్టింది. ఆ సమయంలో 37 మంది విద్యార్థులు ఉన్నారందులో. డ్రైవరు వినోద్‌కు కాలు విరగ్గా, చిన్నారి రిషితకు నాలుగు తెగి గాయమైంది. మిగిలిన లిఖిత్, భరత్, నానీష్, గోకులకృష్ణ, యువశ్రీ, గీతిక, జస్మిత, క్రిషిక, నవ్యశ్రీ, సంజన, దర్శిక్, లక్ష్మీచరణ్, మహిత్‌కుమార్, కుముదశ్రీ, నిషిత్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు కలిసి చిన్నారులను బయటకు తీసి ఆస్పత్రులకు తరలించారు. వీరి రోదనలు మిన్నంటాయి.



గాయాలైన చిన్నారులు క్రిషిత, యువశ్రీ, గీతిక

- తడ, ఆంధ్రజ్యోతి

దేవుడా.. ఇదేమి ఘోరం

- తలనీలాలు ఇచ్చేందుకు వచ్చి.. రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి
- మరో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన బస్సు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'దేవుడా.. ఇదేమి ఘోరం' అంటూ ఛిద్రమైన చిన్నారి మృతదేహంతో.. అర్ధరాత్రి వేళ.. రోడ్డుపై తల్లిదండ్రులు విలపించారు. ఒక్కగానొక్క కుమార్తె కళ్లెదుటే ప్రాణాలు కోల్పోవడంతో వారు షాక్‌కు గురయ్యారు. ఈ విషాద ఘటన తిరుపతి రూరల్‌లో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. తమ మూడేళ్ల చిన్నారి హరిప్రియకు తిరుమలలో తలనీలాలు సమర్పించేందుకు శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ఓబులదేవిచెరువు గ్రామానికి చెందిన వేణుగోపాల్, అశ్విని దంపతులు, మహిళతో కలిసి గురువారం వచ్చారు. తొలుత వీరు శ్రీకాళహస్తికి వెళ్లారు. శివయ్యను దర్శించుకున్నారు. అర్ధరాత్రి తిరుమలకు కారులో బయలుదేరారు. జాతీయ రహదారి నుంచి ఆర్సీపురం సర్కిల్లో తిరుపతికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో బెంగళూరు నుంచి విశాఖపట్నంకు వెళుతున్న ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి వీరి కారును ఢీకొంది. ఈ ఘటనలో హరిప్రియ అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవింగ్ చేస్తున్న వేణుగోపాల్ వెనుక సీట్లో కూర్చొని ఉన్న ఆయన భార్య అశ్విని, మరో మహిళ గాయాలతో బయటపడ్డారు. కారులో ఛిద్రమైన హరిప్రియ మృతదేహాన్ని స్థానికులు బయటకు తీశారు. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు.'దేవుడా ఇదేమి ఘోరం'అంటూ అర్ధరాత్రి నడిరోడ్డుపై ఆ తల్లిదండ్రుల ఆక్రందనలు అటుగా వెళ్లే వారితో కన్నీరు పెట్టించాయి. ఒక్కగానొక్క కుమార్తె మాంసపు ముద్దలా మారడాన్ని చూసిన ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ పోలీసులు బస్సు డ్రైవరు గురుశాంత్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

శ్రీవారి సేవలో...


శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో బినోద్ కుమార్ - సంగీత దర్శకుడు తమన్ - గాయకులు అద్వితీయ, శ్రుతి రంజని

శ్రీవారికి మినీ ట్రక్కు విరాళం

తిరుమల శ్రీవారికి శుక్రవారం అశోక్ లేలాండ్ కంపెనీ బిజినెస్ హెడ్ విప్లవ్ షా రూ.6.60 లక్షల విలువైన సాథీ మినీ ట్రక్కును విరాళంగా అందజేశారు. శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించాక వాహన పత్రాలు, తాళాలను ఆలయ ఏఈవో మోహన్‌రాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో అశోక్ లేలాండ్ సేల్స్ హెడ్ శ్రీకాంత్ రాజ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


వాహన తాళాలను ఏఈవోకు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,776

తలనీలాలు సమర్పించినవారు: 22,386



కవలలు.. కలుస్తున్నారిలా..


హేమవతి - హేమలత

ఒకే పోలికతో ఉన్న ఇద్దరిని చూడగానే ముచ్చటేస్తుంది. అలాంటిది దాదాపుగా 70మంది కవలలు ఒకే వేదికపై కలుస్తున్నారంటే ఇంతకంటే ఆనందమేముంటుంది. జాతీయ కవలల దినోత్సవం పురస్కరించుకుని శనివారం వీరందరి సెలబ్రేషన్స్‌కు నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రం వేదిక కానుంది. ఉదయం 10గంటలకు కేక్‌కటింగ్‌తో కవలల సందడి మొదలవుతుంది. ర్యాంప్ వాక్, డ్యాన్స్, సింగింగ్ లాంటి వివిధ పోటీల్లో వీరంతా ఉత్సాహంగా పాల్గొంటున్నారు.. ప్రతిభ కనబరిచిన కవలలకు బహుమతులు కూడా ప్రదానం కూడా ఉంటుంది. కొన్నేళ్లుగా ఇలా వేడుక నిర్వహణకు బాధ్యత వహిస్తున్నారు నగరానికి చెందిన హేమావతి, హేమలతలు. వీరిద్దరూ కూడా కవలలేనండోయ్.. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో కవలల కలయిక వెనుక ఉన్న ప్రయత్నాన్ని వివరించారిలా..

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


చరణశ్రీ - చరణ్యశ్రీ

దీక్షిత, దర్శిల్ (హైదరాబాదు)

హితీష్, హిమ్మేష్

- వేదిక కానున్న వేమన విజ్ఞానకేంద్రం
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం


వీరేంద్ర, విజయేంద్ర (బద్వేల్)


హుస్సేన్, హుస్సేన్ (పీలేరు)

తొలిసారి వేడుకలకు మేమిద్దరమే...

తిరుపతి రాయలచెరువురోడ్డు యాదవకాలనీ మా స్వస్థలం. నాన్న సహదేవ కారుడ్రైవర్, అమ్మ గృహిణి. 7 వ తరగతిలో చదువుతుండగా కవలల దినోత్సవం రోజున ప్రేయర్‌లో 2వ తరగతి విద్యార్థులు రామ్‌లక్ష్మణ్‌లను పిలిచారు. టీచర్స్ శుభాకాంక్షలు తెలిపారు. తరువాత మాఇద్దరికీ కూడా శుభకాంక్షలు తెలిపారు. అప్పుడే తెలిసింది కవలలకు ప్రత్యేక రోజు ఉందని. వచ్చే ఏడాది నుంచి సంబరాలు చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాం. అమ్మానాన్నలకు చెబితే సరే అన్నారు. 2007లో తొలిసారిగా కవలల దినోత్సవాన్ని చేసుకున్నాం. అప్పుడు మాతో నాలుగు జంటల కవలలు కలిశారు. ఆ తరువాత ఏటా ట్విన్స్ రావడం పెరిగారు. 2018లో 50మందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశాం. కరోనా నేపథ్యంలో 2020, 2021లో వేడుకలు జరుపుకోలేదు. 2022, 2023, 2024లలో 70జంటలకు తగ్గకుండా కవలల దినోత్సవం జరుపుకొంటున్నాం. కుటుంబంలా ఏర్పడుతున్నాం. ఏటా మాతో పాటు మరో నలుగురు విరాళం అందిస్తున్నారు. ఎంబీఏ చదివిన మేము ప్రస్తుతం బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాం. వేడుక కోసం ఏటా రెండు రోజుల ముందుగా ఇంటికి వస్తాం. సంబరాలకు ఏర్పాట్లు చేస్తాం. తిరుపతిలో ఉంటున్న హితీష్, హిమ్మేష్, చరణశ్రీ, చరణ్యశ్రీ, తెలంగాణ గద్వాల్ నుంచి విజేంద్ర, వీరేంద్ర, పీలేరుకు చెందిన హుస్సేన్, హుస్సేన్, హైదరాబాదుకు చెందిన దీక్షిత, దర్శిల్ కూడా ఆర్థిక సహకారమందిస్తున్నారు. ఈ ఏడాది శనివారం వేమనవిజ్ఞాన కేంద్రంలో సెలబ్రేషన్స్ చేసుకుంటున్నాం. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి, కడప, మదనపల్లి, కర్నూల్, హైదరాబాద్, బెంగళూరు, గద్వాల్ నుంచి కూడా ట్విన్స్ వస్తున్నారు. సేవా కార్యక్రమాలు చేయాలన్నదే మా ఆకాంక్ష. రక్తదాన, అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా చేయాలి. పేద కవలలను ఆదుకోవాలి. వారి విద్య, వైద్యానికి చేయూత అందించాలనుకుంటున్నామని హేమావతి, హేమలత వివరించారు.



ప్రాచీన సంగమేశ్వర ఆలయం

స్వర్ణముఖి నదీ తీరాన వెలసిన సంగమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాదిస్తారు. తమ కోరికలు తీర్చే దైవంగా విశ్వసిస్తారు. కోట మండలం గూడలిలో చోళరాజులు నిర్మించిన స్వామి ఆలయానికి విశేష చరిత్ర ఉంది. ఎప్పటిలా ఈ ఏడాదీ మహాశివరాత్రి వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది.

- కోట, (ఆంధ్రజ్యోతి)

అటు సంగమయ్య.. ఇటు సోమయ్య

- గూడలి సంగమేశ్వరుడి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

సంగమేశ్వరుడి ఆలయం వెనుక ఆసక్తికర ఇతిహాసముంది. ఆరవ శతాబ్దంలో అగస్త్య మహాముని కాశీ నుంచి కన్యాకుమారికి వెళ్తూ గూడలి వద్ద రాత్రిపూట బసచేశాడు. మర్నాడు ఉదయాన్నే స్వర్ణముఖినదిలో స్నానం చేస్తుండగా ప్రకృతి ప్రళయ గర్జన సృష్టించింది. వటవృక్షాలు సైతం నేలకొరిగిపోయాయి. స్నానానికి ముందు అగస్త్య మహాముని నరది ఒడ్డునపెట్టిన రుద్రాక్ష మాలలు చెక్కు చెదరలేదు. అంతేకాదు ఆ రుద్రాక్షమాలన్నీ శివలింగ ఆకృతిలో కొలువుదీరాయి.. దీంతో విస్తుపోయిన మహాముని ఈ ప్రాంతంలో సాక్షాత్తూ పరమేశ్వరుడే ఉన్నాడంటూ నాటి చోళరాజుల్లో పెద్దవాడైన పెదపాండ్యభూపతిరాజుకు చెబుతాడు. వెంటనే భూపతిరాజు గూడలిలో స్వర్ణముఖినది తీరానా కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుని ఆలయాన్ని నిర్మించారనిఐతిహ్యం ప్రచారంలో ఉంది. చోళరాజుల హయాంలోని విలువైన భూములను మాన్యంగా ఇచ్చారు. అప్పటి నుంచి సంగమేశ్వరుడి ఈ ప్రాంతంలో భక్తుల పూజలందుకుంటున్నాడు.


గూడలిలో సంగమేశ్వరుడు విగ్రహం

దేవదాయశాఖ పరిధిలో...

సంగమేశ్వరుడి ఆలయం ఇప్పుడు దేవదాయశాఖ పరిధిలోకి ఉంది. 14 ఎకరాల మాన్యం భూముల కౌలుతో ఏటా శివరాత్రి ఉత్సవాలు, ఏప్రిల్ మొదటివారంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆలయంలో అన్నదానానికి ప్రత్యేక గదుల నిర్మించాలని ప్రతిపాదించారు. కోనేరుకు స్థలం లేనందున పక్కనే ఉన్న స్వర్ణముఖినదిలో భక్తుల స్నానాలు చేసి సంగమయ్యకు మొక్కులుతీర్చుకుంటారు. నాటి రథమే నేటికీ చెక్కుచెదరకుండా స్వామి సేవలో తరిస్తోంది. కామాక్షి దేవి అమ్మవారికి ఇటీవ వెండిచీరను అలంకరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.

ఎలా చేరుకోవాలంటే..

నాయుడుపేటకు చేరుకుని కోట-నాయుడుపేట మార్గం మీదుగా 25 కిలోమీటర్లలోని గూడలికి రావాలి. నెల్లూరు నుంచి గూడూరు నుంచి రావాలనుకుంటే విద్యానగర్‌కు చేరుకొని 1.5 కిలోమీటర్లు నడిచి గాని, వాహనాల్లో గూడలి చేరుకోవచ్చు.

చేరువలో భీమయ్య ఆలయం

సంగమేశ్వరుని ఆలయానికి కొన్ని మీటర్ల దూరంలోనే గూడలి తిప్ప ఉంది. ఈ తిప్పపై పర్వతవర్ధిని సమేత భీమేశ్వర ఆలయముంది. ఈ ఆలయం కూడా 500 ఏళ్ల పైబడిన ఆలయంగా చెబుతుంటారు. తిప్పమీద భీమేశ్వరుడు, తిప్ప కింద సంగమేశ్వరుడు రెండు కళ్లతో తమను కాపాడుతారని ఇక్కడి తీర మండలాల ప్రజల నమ్మకం. ఈ రెండు ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


రేస్ కార్ ఆవిష్కరణలో తమన్ తదితరులు

అంబరం సాంకేతిక సంబరం

- ఐఐటీలో అట్టహాసంగా తిరుత్సవ్ ఆరంభం


వేదికపై మాట్లాడుతున్న తమన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో తిరుత్సవ్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. టెక్నో కల్చరల్ ఫెస్ట్ తిరుత్సవ్ పేరుతో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుక శుక్రవారం ప్రారంభమైంది. సాంకేతిక నైపుణ్యాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఐఐటీ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, 3డీ లైట్లతో తీర్చిదిద్దారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు ఐఐటీ విద్యార్థుల ఆధ్వర్యంలో సాంకేతిక వర్క్‌షాప్‌లు, ఎగ్జిబిషన్ జరిగాయి. వినూత్న ఆవిష్కరణలపై చర్చించారు. సాంకేతిక అంశాలను పోటాపోటీగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై
కల్యాణ వెంకన్న కటాక్షం



చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజల అనంతరం ఉత్సవర్లను రాజమన్నార్ అవతారంలో అలంకరించి కల్పవృక్ష వాహనంపై అధిష్ఠించారు. మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్నపన తిరుమంజనం(పవిత్రస్నానం), సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది. రాత్రి కాళియమర్దిని అలంకారంలో సర్వభూపాల వాహనంపై స్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు మునిమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారది, నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. శనివారం రాత్రి గరుడ వాహనసేవ జరగనుంది.


కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై స్వామివారు




లోకలైసర్ యాంటెన్నాలు

విమానాశ్రయంలో నూతనంగా అమర్చిన డిస్టాన్స్ మెజరింగ్ ఎక్విప్మెంట్ - విమానాశ్రయం రన్‌వేలో అమర్చిన గ్లైడ్ పాత్

తిరుపతి విమానాశ్రయానికి అధునాతన పరికరాలు

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ స్థాయి విమానాలు ల్యాండింగ్ అయ్యేందుకు రూ.153.16 కోట్లతో అధునాతన పరికరాలను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారని ఎయిర్ పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మానే తెలిపారు.

డిస్టెన్స్ మెజర్మెంట్ ఎక్విప్‌మెంట్: ప్రస్తుతమున్న రన్‌వేపై కేవలం 100విమానాలను ఆపరేటివ్ చేసే స్థాయి నుంచి200 విమానాల రాకపోకలను అధునాతన డిస్టెన్స్ మెజర్మెంట్ ఎక్విప్మెంట్‌ను తిరుపతి విమానాశ్రయంలో అమర్చారు. ఈ అధునాతన పరికరానికి రూ.5.61 కోట్లు వెచ్చించారు.

ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టం(ఐఎల్ఎస్): గతంలో రన్‌వేపై 700 మీటర్ల కెపాసిటీ ఉన్న ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టం(ఐఎల్ఎస్)ను 1500 మీటర్లకు పెంచి అధునాతన పరికరాన్ని అమర్చారు. విమానాలు దిగే సమయంలో బ్యాలెన్స్ చేసుకుని రన్‌వే మధ్య గీతను గుర్తించి క్షేమంగా ల్యాండింగ్‌కు ఈ పరికరం సహకరిస్తుంది. వాతావరణం అనుకూలించని పరిస్థితుల్లోనూ ల్యాండింగ్‌కు సహకరిస్తుంది. ఈ పరికరం ధర రూ.4.4 కోట్లు.

బోయింగ్ విమానాల రాకపోకలకు సుగమం

రన్‌వేను 3810 మీటర్లతో విస్తరించడంతో బోయింగ్ 777, ఎయిర్ బస్ 330 వంటి పెద్దపెద్ద ఎయిర్‌క్రాఫ్ట్‌లు సురక్షితంగా ల్యాండింగ్ కావచ్చు. ప్రస్తుతం అమర్చిన లైటింగ్ కారణంగా రన్‌వేకు స్పష్టంగా కనిపిస్తుండడంతో క్షేమంగా ల్యాండయ్యేందుకు ఉపయోగపడుతుంది. ఈ రన్‌వే నిర్మాణానికి రూ.143.15కోట్లు వెచ్చించారు. వీటన్నింటినీ శుక్రవారం వర్చువల్ విధానంలో ఏఏఐ అధికారులు లాంఛనంగా ప్రారంభించారు.

'వైష్ణవి' డెయిరీ ఎదుట కార్మికుల ధర్నా



పెళ్లకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పెళకూఊరు మండలం పునబాక గ్రామంలో మూసేసిన శ్రీ వైష్ణవి డెయిరీ ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ వ్యవహారం నేపథ్యంలో ఈ వైష్ణవి పరిశ్రమ మూతపడింది. దీనిపై అధికారులు పలు ధపాలుగా ఈ పరిశ్రమలో తనిఖీలు చేశారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా కంపెనీని మూతవేసి ఆచూకీ లేకుండా వెళ్లారు. దీంతో కార్మికులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కంపెనీని మూతవేశారని అయినా కొంతకాలం వేచి చూసి తమకు రావాల్సిన గ్రాట్యుటీతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వాలని కంపెనీ ఎదుట టెంటు వేసుకొని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కంపెనీకి సంబంధించిన ప్రతినిధులు ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు చేరుకొని నెలరోజుల్లో కార్మికులకు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య

- ఇసుకలో పూడ్చిపెట్టిన హంతకులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తిని హతమార్చి ఇసుకలో పూడ్చిపెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం శివనాథపురం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో పలు నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. శుక్రవారం సుగుణ అనే మహిళ రాజీవ్‌నగర్‌లో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇసుక తగ్గింది. దీంతో సమీపంలోని అసంపూర్తిగా ఉన్న ఓ ఇంట్లో ఇసుకను తీసుకునేందుకు మరో మహిళను వెంటబెట్టుకుని వెళ్లింది. అక్కడ ఇంట్లో ఇసుకపై ఉన్న సిమెంటు ఇటుకలను పక్కకు తీయగానే మృతదేహం కాలు బయటపడింది. బిత్తర పోయిన వీరిద్దరూ తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇసుకలోని మృతదేహాన్ని వెలికి తీశారు. సుమారు ఒకటిన్నర నెల క్రితం పూడ్చినట్లు అంచనా వేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వైద్యబృందంతో ఘటనా స్థలంలో పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహం వెలుగు చూసిన ఇంటి స్థలం ఎవరిది అన్నది ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

బాలాయపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీలకు గాను బీసీలకు 20, కాపులకు 10, ఈబీసీ రెండు, కమ్మలకు ఒకటి, రెడ్లకు ఒకటి చొప్పున మొత్తం 34 రుణాలకు ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించగా 258 మంది దరఖాస్తు చేసుకున్నారు. 199 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరి ధ్రువీకరణ పత్రాలను ఆయా బ్యాంకుల ప్రతినిధులు పరిశీలించారు. ఈఓపీఆర్డీ మోహన్‌రాజు, బాలాయపల్లి, జయంపు కెనరా బ్యాంకు ప్రతినిధులు, వెంకటగిరి, బంగారుపేట ఏపీజీబీ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించేందుకే జాబ్‌మేళా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా ద్వారా 350 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

మాతృభాషపై మక్కువ పెంచుకోవాలి


సమావేశంలో ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్

గూడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష భావవ్యక్తీకరణకు, మానసిక వికాసానికి దోహద పడుతుందన్నారు. మాతృభాష అభివృద్ధికి పాటుపడుతూ జీవనోపాధికి అవసరమైన ఇతర భాషల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, కోటేశ్వరరావు, విజయ మహేష్, శ్రీధర్‌శర్మ, సురేంద్ర, రవిరాజు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను మే నెలలోగా పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, భారతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ గౌరీశంకర్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామనాయుడు, కృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాషపై మక్కువ పెంచుకుని మాతృభాషను పరిరక్షించు కోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మాతృభాష విశిష్టతపై క్విజ్, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, ఆదిలక్ష్మి, నాగభూషణమ్మ, చంద్రశేఖర్, మంజుశ్రీ, డీవీరమణయ్య, చిన్నమస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపపిల్లల విడుదల

చిల్లకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరం, రామారెడ్డిపాళెం, ఏరూరు గ్రామాల చెరువులలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి రఘుబాబు మాట్లాడుతూ ఆయా గ్రామాల చెరువులలో 5 లక్షల చేపపిల్లలను విడిచి పెట్టామన్నారు. పూడిపర్తి ప్రవీణ్‌రెడ్డి, చేవూరు నాగరాజు, అన్నం మునిశేఖర్‌గౌడ్, శీనయ్య, రాజయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


సమస్యలు తెలుసుకొంటున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దక్కిలి, ఫిబ్రవరి 21 : (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని బీమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈ గ్రామంలో మొత్తం 1200 ఎకరాలు భూములు రీ సర్వే పూర్తి చేశామన్నారు. రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించామని వివరించారు. డివిజనల్ సర్వేయర్ సుబ్బరాయుడు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, మండల సర్వేయర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

కోట ఎఫ్‌ఏసీ ఎంపీడీవోగా గోపీనాథ్



కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట ఎఫ్‌ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు) ఎంపీడీవోగా చిల్లకూరు ఎంపీడీవో గోపీనాథ్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా ఉన్న వేణు గతంలో వలే ఈవోపీఆర్డీగానే వ్యవహరించనున్నారు. కాగా అవినీతి ఆరోపణలు రావడంతో టీడీపీ నాయకుల కోరిక మేరకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి ఆయన్ను పక్కకు తప్పించినట్లు సమాచారం.

విద్యార్థి సంఘాల ఆందోళన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తడ వద్ద ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు బోల్తాపడిన ఘటనను నిరసిస్తూ విద్యార్థి సంఘ నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి, నారాయణ పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు వెంటనే సంబంధిత పాఠశాల గుర్తింపు రద్దుచేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులను పరామర్శించి వెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ కారును అడ్డుకొనేందుకు విద్యార్థి సంఘ నాయకులు ప్రయత్నించారు. వారికి పోలీసులు సర్దిచెప్పి పంపించేశారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు తేజ, సూర్య, సన్నీ, నరేంద్ర, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ప్రిన్సిపాల్ తులసిజ్యోతి శుక్రవారం తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. దరఖాస్తు చేసుకోవడానికి డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని ఆమె కోరారు.

దొరవారిసత్రం: మావిళ్లపాడు మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 31లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సుమలత కోరారు. వివరాల కోసం పాఠశాలలో సంప్రదించవచ్చుని తెలియజేశారు.

మూడు చెరువుల్లో చేపల విడుదల



కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మూడు చెరువుల్లో శుక్రవారం మత్స్యశాఖ అధికారులు చేపలను విడుదల చేశారు. ముందుగా మద్దాలి చెరువులో 11,250 చేపపిల్లలు, కేశవరం చెరువులో 18,200, ఊనుగుంటపాళెం చెరువులో 5,070 చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు వదిలారు. సాగునీటి సంఘాల పర్యవేక్షణలో ఈ చేపపిల్లలను వదిలారు. ఎఫ్‌డీవో రెడ్యానాయక్ మత్స్యశాఖ అసిస్టెంట్ నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

తడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాములమిట్ట పాఠశాలలో హెచ్‌ఎం ఉస్మాన్‌బాషా, కాశింగాడుకుప్పం పాఠశాలలో హెచ్‌ఎం రఘురామయ్య, స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భావ వ్యక్తీకరణ మాతృభాషతోనే సాధ్యపడుతుందని ప్రముఖ కవి దాసరి చంద్రయ్య అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాలలో ఉపాధ్యాయులు చెంగయ్య, రమణమ్మ, వేమయ్య, మంజుల, కళ్యాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రూ.2 వేలతో 40 లక్షల ప్రమాద బీమా

తడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని ఎస్‌బీఐ మరింత విస్తరించిందని ఏటా రూ.2 వేలు చెల్లిస్తే 40 లక్షల ప్రమాద బీమాకు అవకాశం ఉంటుందని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రామాంజనేయులు తెలి పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 70 వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ బీమాకు అర్హులని అన్నారు. వంద రూపా యలతో ఈ ప్రీమియం మొదలవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కరెంట్ షాక్‌లు, వరదలు, భూ కంపాలు, విషసర్పాల ప్రమాదబాధితులకు బీమా వర్తిస్తుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాతృభాష ఎంతో విశిష్టమైనది


పుదూరు గురుకులంలో మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రూత్ రమోలా

నాయుడుపేట, ఫిబ్రవరి 21: ఏ ప్రాంతంలోనైనా, ఏదేశంలోనైనా మాతృభాష ఎంతో విశిష్టమైనదని గురుకుల ప్రిన్సిపాల్ రూత్ రమోలా అన్నారు. పుదూరులోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకురాలు తన్నీరు శశి పిల్లలకు బాలగేయ రచనలు, కవితల విశిష్టతలను విద్యార్థులకు తెలియజేశారు. కవితలతో రూపొందించిన బాల గేయాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సునీత, భూలక్ష్మి, వరలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటీ ఏజెన్సీలకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలని సీఐటీయూ నాయకులు పద్మనాభయ్య కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన చేశారు. ఈ సందర్భంగా పద్మనాభయ్య మాట్లాడుతూ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేసి పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు లక్ష్మయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వారీ వద్దే వద్దు

● ఆరిమేనిపాడు క్వారీ వద్ద గ్రామస్తుల నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు


క్వారీ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరరావు


గ్రావెల్ తరలింపు కోసం వచ్చిన టిప్పర్లు

ఓజిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం ఆరిమేనిపాడు గ్రావెల్ క్వారీ తమకు వద్దే వద్దని గ్రామస్తులు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. రెండు రోజుల కిందట పోలీసు బందోబస్తు మధ్య క్వారీ నిర్వాహకులు గ్రావెల్ తరలించారు. దీంతో శుక్రవారం గ్రామస్తులంతా ఏకమై క్వారీ వద్దకు చేరుకుని సమీపంలో రోడ్డుకు అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో కొండ తిప్పగా దాదాపు 200 ఎకరాలకు పైనే ఉందన్నారు. ఇది ఎప్పటినుంచో తమ పశువులకు, జీవాలకు మేత భూమిగా ఉంద న్నారు. ఈ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు తమ చెరువులకు చేరుతుందని వివరించారు. ఇక్కడ క్వారీలు ఏర్పాటుచేస్తే మొదట పశువులు, జీవాలకు మేత ఉండదని విచారం వ్యక్తం చేశారు. అలాగే తమ చెరువులు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ ఏర్పాటు కోసం అప్పట్లో జరిగిన అభిప్రాయ సేకరణలో తామంతా క్వారీని వ్యతిరేకించామని గుర్తుచేశారు. అయితే గ్రామానికి సంబంధంలేని వారితో సంతకాలు చేయించి అధికారులు ఈ తతంగాన్ని నడిపించారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరావు ఆధ్వర్యంలో ఓజిలి, దొరవారిసత్రం ఎస్‌ఐలు స్వప్న, అజయ్‌కుమార్ తమ సిబ్బందితో గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ క్రమంలో క్వారీ అనుమతి పత్రాలు చూపాలని నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. క్వారీ అనుమతుల గడువు తీరిపోయిందని ఇటీవల మళ్లీ పునరుద్ధరించుకున్నామని వారు బదులిచ్చారు. దీంతో పునరుద్ధరించిన అనుమతి పత్రాలు అందజేయాలని పోలీసులు సూచించారు. అలాగే శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని క్వారీ నుంచి ఎలాంటి తరలింపులు జరగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

పాఠశాల విలీనాన్ని ఆపాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, తల్లిదండ్రులు

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలో గల విశ్వనాథపురం అగ్రహారం పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలంటూ శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విశ్వనాథపురం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, సీనియర్ టీడీపీ నాయకులు, పెన్నక్క చెరువు సాగునీటిసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విలీనాన్ని ఆపాలని విశ్వనాథపురం అగ్రహారం పాఠశాలలోనే తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్యలకు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై వారు స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదించి విలీనాన్ని ఆపేందుకు కృషిచేస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

భూగర్భ వనరుల దోపిడీ

● చెలరేగిపోతున్న మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా


మనవాలి చెరువులో ఏర్పడిన భారీ గోతి

ఓజిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో భూగర్భ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొందరు మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ తరలింపును ప్రధాన ఆర్థిక వనరుగా మార్చుకుంటున్నారు. ఇక్కడికి సమీపంలోనే మేనకూరు సెజ్ ఉండటంతో పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలకు ఇసుక, మట్టి, గ్రావెల్ అవసరం దృష్ట్యా ఈ అక్రమ తరలింపు నిత్యం సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడపడితే అక్కడ ఇసుక, గ్రావెల్, మట్టి తరలింపు యథేచ్ఛగా కొనసాగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లోనూ అదే జరుగుతోంది. నీటిపారుదల, మైనింగ్ శాఖల కళ్లుగప్పి అడ్డదారిలో అక్రమాలకు పాల్పడుతున్నారు. మండలంలోని మనవాలి చెరువులో శుక్రవారం పెద్దఎత్తున మట్టి తరలింపు చేపట్టారు. మూడు రోజుల నుంచి ఇక్కడ మట్టి తరలించడంతో 15 అడుగుల లోతుగల భారీ గోతులు పడ్డాయి. గ్రావెల్, మట్టి, ఇసుక తరలిం పును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే విజయశ్రీ


విద్యార్థి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకులు రమేష్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సు ప్రమాదంలో గాయపడి సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆమె ఆస్పత్రి వైద్యులు రమేష్‌ను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి వివరాలడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కావడంతో ఆమె స్వయంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు తదితరులు ఉన్నారు.

జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జున్‌రెడ్డి

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఇక్కడ ఇంజనీరింగ్ చదువుతున్న ఇందు దర్శిని, ప్రసాద్ పులివెందుల జేఎన్‌టీయూఏ ఆధ్వర్యంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచారు. దీంతో వారు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 25 నుంచి మార్చి 3వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రీడాపోటీల్లో అనంతపురం జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారు. ఈ క్రీడలు తమిళనాడులోని సేలంలో గల పెరియార్ విశ్వ విద్యాలయంలో నిర్వహించనున్నారు. కాగా ఎంపికైన వారిని శుక్రవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే క్యాట్ లెవల్-2 ఒలంపియాడ్ పరీక్షల్లో కోటలోని శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో ఎంఈవో శైలజ వారిని అభినందించినట్లు ప్రిన్సిపాల్ చిరంజీవి శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 80 మంది విద్యార్థులు ఆయా ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అందులో 9 మంది విద్యార్థులు నగదు బహుమతి, మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌లు సాధించగా 34 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. వీరితో పాటు మరో 37 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. ఆయా విద్యార్థులను ఎంఈవో శైలజ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జిలు వేణుగోపాల్‌రావు, డీన్ శివయ్య, హరిత, వినీల, నాగూర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట బడ్జెట్ రూ.23.60 కోట్లు

ఆమోదం తెలిపిన మున్సిపల్ కౌన్సిల్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, పక్కనే కమిషనర్ చిన్నయ్య

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాలులో మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. 2025-26 సంవత్సరానికి రూ.23.60 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. ఈ దఫా అభివృద్ధి పనులతో పాటు ఇతర అవసరాలు, సిబ్బంది జీత భత్యాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపకల్పన చేసి కౌన్సిల్ ముందు పెట్టారు.

2024-25 బడ్జెట్‌తో పోలిస్తే 2025-26 బడ్జెట్ అంచనా శాతం తగ్గింది. గతేడాది (2024-25) రూ.27,83,36,153 అంచనా విలువతో బడ్జెట్ కేటాయింపు జరిగాయి. ఈ దఫా కొంతమేర సవరించి సుమారు రూ.4 కోట్ల మేర తగ్గించారు. గతేడాది బడ్జెట్ వసూళ్ల రూ.19 కోట్లు ఉండగా 2025-26కు రూ.15 కోట్లుగా అంచనా వేసింది కౌన్సిల్. 2024-25లో నగదు, బ్యాంకు నిల్వ వెరసి ముగింపు నిల్వ రూ.1,25,01,153 ఉండగా 2025-26లో నిల్వ రూ.2,01,01,153 ఉండవచ్చునని అంచనా వేశారు. 2024-25లో రాబడి ఆదాయ 36 శాతం ఉండగా 2025-26లో 40 శాతంగా ఉండవచ్చునని అంచనా వేశారు. మొత్తం 23.60 కోట్లతో కౌన్సిల్ ముందు ఉంచగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

కౌన్సిల్ ముందుకు పలు సమస్యలు

బడ్జెట్ ఆమోదం అనంతరం వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణతో పాటు పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలు కౌన్సిల్ ముందుకు తెచ్చారు. ముఖ్యంగా బజారు వీధుల్లో ఆక్రమణలకు గురై కనీసం మోటారు సైకిళ్ల పార్కింగ్ చేసుకొనేందుకు స్థలం లేదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణలు తొలిగించి వాహనాల పార్కింగ్ కు స్థలం కేటాయించాలని వైస్ చైర్మన్ చిన్ని సత్యనారయణ కోరారు. కమిషనర్ చిన్నయ్య స్పందిస్తూ సమస్య పరిష్కరిస్తామన్నారు. రైల్వే గేటు సమీపంలో అండర్ బ్రిడ్జి కోసం తెచ్చిన సిమెంట్ దిమ్మెలు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని వాటిని తొలగించాలని కౌన్సిలర్ శరత్ గౌడ్ కోరారు. పరిశ్రమలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మ, డీఈ శ్రీనివాసులు, టీపీవో బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యువజన అధ్యక్షుడిగా పాలేటి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ యువజన అధ్యక్షుడుగా పాలేటి నాగార్జునను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

సిమెంట్ రోడ్ల తనిఖీ

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సిద్ధమ్మకండ్రిగ, ప్రకాశంకాలనీ, విజయకాలనీ, శ్యామ సుందరపురంలో వేసిన సిమెంట్ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. క్వాలిటీ కంట్రోల్ జేఈ వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సిమెంట్‌రోడ్ల నాణ్యతను శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కిరణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మాతృభాషను మరవద్దు

కోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మాతృభాషా దినోత్సవం జరిగింది. ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ మాతృభాషా దినోత్సవాలలో విద్యార్థులు తెలుగు ప్రాముఖ్యతను వివరిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. ఆయా విద్యార్థులను, హెచ్‌ఎంలను ఎంఈవో అభినందించారు.

ఎంపీడీవోగా మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎంపీడీవోగా ఏవీ. మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తడ మండల ఏవోగా ఉన్న మురళీకృష్ణను సూళ్లూరుపేట ఎంపీడీవోగా నియమిస్తూ నెల్లూరు జెడ్పీ సీఈవో విద్యారమ ఉత్తర్వులు జారీ చేశారు.

నేత్రదానం


ఆలపాటి సుమిత్ర (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వహిస్తున్న నేత్రదానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. శుక్ర వారం సూళ్లూరుపేటలోని వనంతోపునకు చెందిన ఆలపాటి సుమిత్ర (82) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సాయిరాం పాల్గొన్నారు.

వైసీపీ మహిళా అధ్యక్షురాలిగా రత్నశ్రీ

నాయుడు పేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరు పేట నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షు రాలుగా మేడిద రత్నశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మాజీ మంత్రి గౌతంరెడ్డికి నివాళులు

నాయుడుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు నివాళులర్పించారు. నెల్లూరులోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఒట్టూరు కిషోర్‌యాదవ్, కటకం జయరామయ్య, పాలేటి నాగార్జున, గండవళ్లి సిద్ధయ్య, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, షబ్బీర్, ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

2.5 సవర్ల బంగారం చోరీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పొగగొట్టం కాలనీలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొగగొట్టం కాలనీలో ఉంటున్న జయరామయ్య ఇంటికి తాళం వేసుకుని వెళ్లాడు. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 2.5 సవర్ల బంగారు, 100 గ్రాముల వెండి వస్తువులను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ బాబి కేసు నమోదు చేశారు.